RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:260 ఆదివారం 08 నవంబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy



దీపావళి శుభాకాంక్షలు

శెనార్తి మీడియా పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు దీపావళి శుభాకాంక్షలు. దీపావళి సందర్భంగా ఆదివారం శెనార్తి మీడియా కార్యాలయానికి సెలవు. సోమవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం



అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి: మోదీ

- దేశ ప్రజలకు ప్రధాని దీపావళి శుభాకాంక్షలు
- సైనికులతో కలిసి పండుగ జరుపుకోనున్న ప్రధాని

న్యూఢిల్లీ, నవంబర్ 7:

దీపావళి పండుగ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితం సుఖసంతోషాలు, విజయాలతో వెలిగిపోవాలని ఆకాంక్షించారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. పవిత్రమైన దీపావళి ప్రతి ఒక్కరికీ ప్రశాంతత, విజయాలు, ఆనందాన్ని అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా దీపావళిని సైనికులతో కలిసి జరుపుకుంటున్న మోదీ.. ఈ ఏడాది కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగించనున్నట్లు వీడియోలో వెల్లడించారు.



సర్వ సంపదలు చేకూరాలి

- రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ దీపావళి శుభాకాంక్షలు

హైదరాబాద్, నవంబర్ 7 :

దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. అజ్ఞానపు చీకట్లను తొలగించుకుని జ్ఞానకాంతులను ఆహ్వానించాలనే సందేశాన్ని దీపావళి పండుగ మనకు అందిస్తున్నదని తెలిపారు. దీపావళి ప్రత్యేక సాంప్రదాయం, బాణాసంచా కాల్చే సందర్భంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ కుటుంబ సభ్యులందరూ పండుగ సంబురాలు జరుపుకోవాలని కేసీఆర్ కోరారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తొలగి సర్వ సంపదలు చేకూరేలా, రాష్ట్రం తిరిగి ప్రగతి పథంలో పయనించేలా లక్ష్మీదేవి అమ్మవారు కరుణాకటాక్షాలు అందించాలని ప్రార్థించారు.

సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ దోపిడీ

- కొడంగల్-నారాయణపేట-మక్తల్ టెండర్లలో పాంగులేటి కంపెనీకి లబ్ధి
- మిగతా కంపెనీలన్నీ నామమాత్రమే
- రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం
- చుక్క నీరు అందకముందే ఐదు రెట్లకు చేరిన అంచనా వ్యయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

హైదరాబాద్, నవంబర్ 7 :

కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై ఆయన సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. తలకిందులుగా పడినా

మిగతా 2వ పేజీలో..





కొడంగల్‌ను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతా



- పారిశ్రామికాభివృద్ధికి అనువైన ప్రదేశం
- 2027 డిసెంబర్ కల్లా శంషాబాద్ నుండి కొడంగల్ వరకు రేడియల్ రోడ్ నిర్మాణం పూర్తి
- భావితరాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు విద్యాసంస్థల ఏర్పాటుకు రేర్ ఎడ్యుకేషన్ హబ్
- 'రేర' ఇండస్ట్రియల్ హబ్‌లో పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి

కొడంగల్, నవంబర్ 7 :

కొడంగల్ రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ(రేర్) ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధితో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2027 డిసెంబర్ కల్లా శంషాబాద్ నుండి కొడంగల్ వరకు రేడియల్ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని, విమానాశ్రయాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఇండస్ట్రియల్ హబ్ ఆవిష్కరణ కార్యక్రమం

మిగతా 2వ పేజీలో..

పాలమూరుకు కేసీఆర్ నమ్మకద్రోహం



- కేటీఆర్ గడ్డం పెంచితే రేవంత్ అయిపోడు
- కాళేశ్వరం డిజైన్ లోపాలతోనే మేడిగడ్డ కుంగుబాటు
- డిసెంబర్‌లో కాళేశ్వరం, ఎల్లనినోపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు
- హైదరాబాద్- లగచర్లను ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేస్తాం
- ఎల్లనినోతో నీటి ఎద్దడి తప్పదు
- కొడంగల్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

2

ప్రతి ఇంటా ఆనందోత్సాహాలు నిండాలి: సీఎం

అంత కష్టపడితే విద్యుత్ సరఫరా ఏడు గంటలేనా?

- మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు ఎందుకు కాలిపోతున్నాయి?
- కేసీఆర్ హయాంలో యూరియాకు కొరత లేదు
- రేవంత్ పాలనలో యాప్ పేరుతో రైతుల పాట్లు
- మూడు పంటలకు రేవంత్ రైతుబంధు ఎగ్గొట్టాడు
- కొడంగల్‌లో అభివృద్ధి పనులు చేసింది కేసీఆర్ ప్రభుత్వమే
- మరి నువ్వు సిద్దిపేటకు చేసిందేంటి?
- రేవంత్ పై బీఆర్ఎస్ ఎల్పీ ఉప నాయకుడు హరీష్ ఆగ్రహం



హైదరాబాద్, నవంబర్ 7:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌కు పోయి నన్ను తిడుతూ.. కొడంగల్‌కు కేసీఆర్ ఏం చేశాడు, హరీశ్ రావు ఏం చేశాడు అని అడుగుతున్నాడు. రేవంత్ రెడ్డీ.. కళ్లు తెరిచి చూడు! కేసీఆర్

మిగతా 3వ పేజీలో..



దోచుకున్నది చాలక మళ్లీ అధికారం కోసం కలలు

- సీఎం కుర్చీ కోసం ప్రతిపక్ష నేత ప్రమాణస్వీకార రిహార్సల్స్
- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు నింపుదాం
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి

3

ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు

- తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకే చోట సదుపాయాలు
- పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు
- సచివాలయంలో ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్



2

తెలంగాణ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,625 పీజీ సీట్లు

- కొత్తగా 359 సీట్లకు జాతీయ వైద్య కమిషన్ ఆమోదం
- 10 నుంచి 23కు పెరిగిన పీజీ కోర్సులున్న కాలేజీలు



2

గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ



- సొంత ఆదాయాన్ని నేరుగా ఖాతాల్లో జమ చేసుకునే వెసులుబాటు
- పంచాయతీరాజ్ చట్టానికి నాలుగో సవరణ
- అక్టోబర్ 9 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి
- అభివృద్ధి పనుల్లో నిధుల జాప్యానికి తెర
- జీవో ఎంఎస్ నెం.43 జారీ చేసిన ప్రభుత్వం

3

ఇందిర హత్య.. రాజీవ్ ప్రధాని పదవిపై సోనియా ఆవేదన

- ఇందిర మరణించిన రోజే రాజీవ్‌కు ప్రధాని బాధ్యతలు
- పదవి చేపడితే ప్రాణాలకు ముప్పని సోనియా ఆందోళన
- 'పదవి చేపట్టకపోయినా చంపేస్తారు' అన్న రాజీవ్
- ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో కీలక విషయాలు
- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ



4



ఐఏఎఫ్ ప్రపంచ రికార్డు

- న్యోమాలో భారీ సైనిక విమానం ల్యాండింగ్..
- 13,629 అడుగుల ఎత్తులో ఐఎల్-76ఎండీ ల్యాండింగ్
- * ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఘనత
- * చైనా సరిహద్దుకు సమీపంలో వ్యూహాత్మక స్థావరం

4

పెట్రోల్‌లో ఇథనాల్ మోతాదుపై రాహుల్ ఫైర్

- 'ఈ20 కాదు.. 420' అంటూ కేంద్రంపై విమర్శలు
- 14 నమూనాల్లో 11లో 20 శాతానికి మించి ఇథనాల్
- ఒక నమూనాలో అత్యధికంగా 31.2 శాతం నమోదు
- మైలేజీ తగ్గుదల, వాహనాల మరమ్మతులపై ఆందోళన



4

పాలమూరుకు కేసీఆర్ నమ్మకద్రోహం

కొడంగల్, నవంబర్ 7 :

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు ప్రాంతానికి తగిన న్యాయం జరగలేదని సీఎం ఆరోపించారు. పాలమూరు ప్రజలు కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించినప్పటికీ, ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాంత సాగునీటి ప్రాజెక్టులపై ఆశించిన స్థాయిలో దృష్టి పెట్టలేదని విమర్శించారు. పదేళ్ల పాలనలో రూ.20 లక్షల కోట్లకు పైగా బడ్జెట్ ఖర్చు చేసినప్పటికీ కీలక ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారని అన్నారు. మూడు రోజుల కొడంగల్ పర్యటనలో భాగంగా శనివారం నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, సభల్లో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పాలన, సాగునీటి ప్రాజెక్టులు, ఎల్‌నినో ప్రభావం, కొడంగల్ అభివృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. సుమారు రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే అవకాశం ఉన్న ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరం అంచనా వ్యయాన్ని భారీగా పెంచారని ఆరోపించారు. సుమారు రూ.1.5 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో మూడేళ్లకే సమస్యలు తలెత్తాయని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి కారణాలు, నిర్మాణ నాణ్యత, అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని అన్నారు.

కేటీఆర్‌కు బుద్ధి రావడానికి ఇంకెన్నాళ్లో?

తనను చూసి కేటీఆర్ గడ్డం పెంచుకుంటున్నారని, వేషభాషలు మార్చుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన రేవంత్‌రెడ్డి కాలేరని, ఎన్ని జన్మలెత్తినా తనలా కాలేరంటూ ఎద్దేవా చేశారు. కేటీఆర్ తనను అనుకరిస్తున్నారని విమర్శించిన రేవంత్‌రెడ్డి.. తనకు గడ్డం రావడానికే 50 ఏళ్లు పట్టిందని, కేటీఆర్‌కు బుద్ధి రావడానికి ఇంకెన్నాళ్లు పడుతుందో అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తాను



ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మూడేళ్లుగా ఒక్క గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. రాబోయే ఎన్ని కల్లో ప్రజలు తమ తీర్పుతో బీఆర్ఎస్‌కు తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

ఎల్‌నినోతో నీటి ఎద్దడి ముప్పు

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఉన్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలోనూ జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గాయని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎల్‌నినో అంశంపై బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ అంశాలపై చర్చించేందుకు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, భూముల వ్యవహారాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. డిసెంబర్‌లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి పంపుల ద్వారా నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుందని సీఎం వివరించారు. బ్యారేజీ దెబ్బతినడంతో పంపుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్ల నిర్వహణ విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఎవరు అడ్డుపడ్డారు?

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ కోరామని, ఆ విచారణ జరగకుండా అడ్డుకున్నదెవరో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తయితే గ్రావిటీ ద్వారా నల్గొండ ప్రాంతానికి నీరు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా కూడా సాగునీరు అందించవచ్చన్నారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే రైతులకు నీరు అందుతోందని, తుపాకులగూడెంకు కూడా అక్కడి నుంచే నీటిని తరలిస్తున్నామని వివరించారు.

కొడంగల్‌ను అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకపోతున్నారు

కొడంగల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని కొందరు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. మక్తల్‌కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా సాగుతున్నాయని, ఈ ప్రాజెక్టు పూర్తయితే పాలమూరు ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. కొడంగల్‌కు రావాల్సిన పరిశ్రమలను గతంలో సిరిసిల్లకు తరలించారని బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేశారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు తమ ప్రభుత్వం ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం అందిస్తోందని తెలిపారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇవ్వడానికి కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీనోయిడా తరహాలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ప్రజలకు కష్టాలు ఎదురైనప్పుడు ప్రభుత్వం అండగా నిలవాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు, ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని ప్రకటించారు.

రైతు మేలా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం

కొడంగల్ పర్యటనలో భాగంగా హకీంపేటలో మెగా రైతు మేలా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రదర్శనలను పరిశీలించారు. అదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. సాగునీటి లభ్యత, రైతుల అవసరాలు, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని సీఎం తెలిపారు.

ప్రతి ఇంటా ఆనందోత్సాహాలు నిండాలి

- **సీఎం రేవంత్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు**

హైదరాబాద్, నవంబర్ 7 :



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ప్రజల జీవితాల్లోని చీకట్లను తొలగించి, వారి బతుకుల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. దీపాల వెలుగులతో ఇళ్లను, పరిసరాలను అలంకరించుకుని ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. దీపావళి కాంతులు ప్రతి ఇంటా సుఖసంతోషాలను నింపాలని, ప్రజల జీవితాలు ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, శాంతిసౌభాగ్యాలతో వెల్లివిరియాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పండుగ సంబరాల వేళ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కాలుష్యానికి తావులేకుండా, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నారులు, పెద్దలు సురక్షిత వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ దోపిడీ

మొదటిపేజీ తరువాయి

తమదే గెలుపు అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారం ఉందని వ్యాఖ్యానించారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం టెండర్లు పిలిస్తే మంత్రి పొంగులేటికి చెందిన సొంత కంపెనీ కూడా టెండర్లలో పాల్గొన్నదని ఆరోపించారు. మిగతా కంపెనీలన్నీ కాగితాలపైనే ఉన్న నామమాత్రపు సంస్థలని, చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం సాధించేలా వ్యవహారం నడిచిందని విమర్శించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరిగిపోవడంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్నప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. అంటే దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగిందని, ప్రజాధనాన్ని ఈ స్థాయిలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అందలేదని విమర్శించారు. అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పారదర్శకతకు తావులేకుండా తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంటే మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించి ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. జరుగుతున్న ఈ దోపిడీని వివరించడానికి క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ, క్లెప్టోక్రసీ వంటి పదాలు కూడా సరిపోవడం లేదని వ్యాఖ్యానించారు.

ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు

హైదరాబాద్, నవంబర్ 7 :

వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. సచివాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైలోల నిర్మాణం, నిర్వహణ, నిధుల సమీకరణపై సమీక్షించారు. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

ధాన్యం సైలోలోకి ఎలా చేరుతుంది?

ధాన్యాన్ని పెద్ద మొత్తంలో నేరుగా నిల్వ చేయగల భారీ ఉక్కు గిడ్డంగులే సైలోలు. ప్రతిపాదిత సైలో కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసేందుకు తూకం వంతెనలు, తేమ, నాణ్యతను పరీక్షించేందుకు ప్రయోగశాల ఏర్పాటు చేయనున్నారు. కేంద్రానికి వచ్చిన ధాన్యంలో మట్టి, చెత్త వంటి మలినాలను యంత్రాల సాయంతో తొలగిస్తారు. తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని డ్రయర్లతో ఆరబెట్టి, సురక్షిత నిల్వకు అనువైన స్థాయికి తేమను తగ్గిస్తారు. ఆరబెట్టిన ధాన్యాన్ని యాంత్రిక పరికరాల సాయంతో నేరుగా ఉక్కు సైలోల్లోకి తరలించి నిల్వ చేస్తారు. ఈ పద్ధతిలో గోనె సంచుల వినియోగం తగ్గుతుంది. నిల్వ సమయంలో ధాన్యం నాణ్యతను పరీక్షించేందుకు, పురుగుల బెదదను నియంత్రించేందుకు అవసరమైన ఏర్పాట్లనూ ప్రతిపాదించారు.

సైలోల ఏర్పాటుకు రెండు నమూనాలు

మొదటి నమూనాలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించి నేరుగా సైలోలను ఏర్పాటు చేయనుంది. రెండో నమూనాలో తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించనున్న సుమారు 20 ప్రదేశాల్లో ప్రైవేటు పారిశ్రామికవేత్తలు సైలోలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తారు. పెట్టుబడులు ఆర్థికంగా ఆచరణ సాధ్యమయ్యేందుకు పౌర సరఫరాల సంస్థ నిర్దిష్ట కాలానికి అద్దె చెల్లింపుల హామీ ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. సైలోల నిర్మాణ, నిర్వహణ వ్యయాలు, నిధుల సమీకరణ, అద్దె చెల్లింపు బాధ్యతలను అంచనా వేయాలని మంత్రి అధికారులను కోరారు. తక్కువ వడ్డీకి ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అనువైన ప్రదేశాలను గుర్తించి, ఆర్థిక, సాంకేతిక నిపుణులతో సంప్రదించి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేయాలన్నారు.

మార్కెట్ ధర అనుకూలించినప్పుడు అమ్ముకునే వీలు

పంట కోసిన సమయంలో ధాన్యంలో సాధారణంగా సుమారు 25 శాతం తేమ ఉంటుందని మంత్రి వివరించారు. ఆరబెట్టే, భద్రంగా నిల్వ చేసే సదుపాయాలు లేక చాలామంది రైతులు అప్పటి మార్కెట్ ధరకే, కొన్నిసార్లు కోత ముగిసిన 24 గంటల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. సైలో కేంద్రాల్లో శాస్త్రీయంగా ఆరబెట్టి నిల్వ చేసే వీలు కలిగితే రైతులు ధర అనుకూలించినప్పుడు ధాన్యాన్ని అమ్ముకోగలుగుతారని చెప్పారు. ప్రీమియం వరి రకాల ధాన్యంలో తేమ సుమారు 25 శాతం ఉన్నప్పుడు క్వింటాలుకు రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. అదే ధాన్యాన్ని శాస్త్రీయంగా ఆరబెట్టి తేమను సుమారు 12 శాతానికి తగ్గిస్తే క్వింటాలుకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ధర పలికే అవకాశం ఉందని వివరించారు. జేఏసఆర్, ఆరఏసఆర్, హెచఎంటీ వంటి తెలంగాణ వరి రకాలకు దేశీయ, విదేశీ మార్కెట్లలో ఆదరణ పెరుగుతోందని, కొన్ని మార్కెట్లలో జేఏసఆర్ బియ్యం బాస్మతి కంటే అధిక ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరికి మెరుగైన నిల్వ సదుపాయాలు కల్పించడం వ్యవసాయ రంగ వృద్ధికి, రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. మ□డు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న తెలంగాణ లక్ష్యానికి ఇది తోడ్పడుతుందన్నారు. సమీక్షలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌ను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతా

మొదటిపేజీ తరువాయి

సందర్భంగా దాదాపు వందమంది పారిశ్రామికవేత్తలతో సీఎం సమావేశమయ్యారు. కొడంగల్ పరిసర ప్రాంతాలు, హైదరాబాద్ విమానాశ్రయ ప్రాంతం, ఇతర పారిశ్రామిక క్లస్టర్లకు చెందిన ఏరోస్పేస్, రక్షణ రంగం, గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం, ఉక్కు, రాగి, టెక్స్ టైల్, వ్యవసాయ ఆధారిత పారిశ్రామిక రంగాల ప్రతినిధులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహా, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. రేర్ ఇండస్ట్రీయల్ హబ్‌తోపాటు నెట్‌వర్క్ ఆఫ్ ఆప్పెరల్ రెడీనెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎనఏ ఆరఐ) పార్క్, ట్రైవ్ హబ్, రీజినల్ ఇండస్ట్రీస్ అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్(ఆరఐఎసఈ) ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని గొప్ప పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడం తన బాధ్యత మాత్రమే కాక తన కల అని తెలిపారు. హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకే పరిశ్రమలు పరిమితం కాకుండా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు విస్తరిస్తూ స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉపాధి అవకాశాలు కలిగించడమే లక్ష్యమని, కొడంగల్ రేర్ ఇండస్ట్రియల్ హబ్‌లో 943.34 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలను ఆకర్షించేలా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కొడంగల్‌తోనే తన గుర్తింపు, ఆత్మగౌరవం అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధికి ఎంతో అనువైన ప్రాంతమని, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. హబ్ భూసేకరణకు రూ.220 కోట్లు వ్యయం కాగా రోడ్లు, నీరు, విద్యుత్తు వంటి మౌలిక వసతులను అభివృద్ధి పనులకు రూ.441.91 కోట్ల వ్యయ ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ హబ్‌లో బిర్లా నూ లిమిటెడ్ సంస్థకు సంబంధించిన ఫైబర్ సిమెంట్ బోర్డుల తయారీ పరిశ్రమ, ఎకోపామ్ ఆయిల్ అండ్ ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు సంబంధించిన వెజిటబుల్ ఆయిల్స్, వ్యవసాయ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల కోసం మొత్తం 96 ఎకరాల భూమిని కేటాయించగా ఈ రెండు సంస్థల ప్రతిపాదిత పెట్టుబడులు మొత్తం కలిపి రూ.252.86 కోట్లు. ఉందని చెప్పారు. వాటితో దాదాపు 535 ఉద్యోగావకాశాలు రానున్నాయన్నారు. ఇప్పటికే పలు కంపెనీలు ఈ ఇండస్ట్రియల్ హబ్‌లో నిర్మాణాలు చేపడుతుండడం, మరిన్ని పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. భావితరాలకు పరిశ్రమల ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలతోపాటు విద్యాసంస్థల ఏర్పాటు కోసం 250 ఎకరాల్లో కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్ రూపుదిద్దుకుంటున్నదన్నారు. రేడియల్ రోడ్ నిర్మాణంతో కేవలం 70 నిమిషాల్లో కొడంగల్ చేరుకునే అవకాశం ఉంటుందని, విదేశీ సంస్థలు పెట్టుబడులు పెట్టే ముందు మొదటిగా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇండస్ట్రియల్ పార్క్ ఎంత దూరంలో ఉందో చూస్తారని వివరించారు. రానున్న కాలంలో చందన్‌వెల్లి, సీతారాంపూర్, పరిగి, కొడంగల్ ప్రాంతాలు గొప్ప పారిశ్రామిక అభివృద్ధికి నోచుకుంటాయని చెప్పారు. కొడంగల్ అన్ని రకాలుగా అభివృద్ధికి అనువైన వ్యూహాత్మక ప్రాంతమని, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తక్కువ దూరంలో ఉండడం విశేషమని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల వనరులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకోసం అధికారులు నిత్యం సహకరించడానికి అందుబాటులో ఉంటారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు జరుగుతుందని, టాటా టెక్నాలజీస్ సంస్థ సహకారంతో విద్యార్థులకు శిక్షణ అందుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కోర్సులు అందించవచ్చని వివరించారు.

తెలంగాణ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,625 పీజీ సీట్లు

- **కొత్తగా 359 సీట్లకు జాతీయ వైద్య కమిషన్ ఆమోదం**
- **10 నుంచి 23కు పెరిగిన పీజీ కోర్సులున్న కాలేజీలు**
- **13 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తొలిసారిగా పీజీ కోర్సులు**
- **నిమ్స్‌లో 107, ఈఎస్ఐసీలో 106 అదనపు సీట్లు**
- **వైద్య విద్యార్థులకు అవకాశాలు, ప్రజలకు మెరుగైన వైద్యం**

హైదరాబాద్, నవంబర్ 7:

తెలంగాణలో వైద్య విద్య, ప్రభుత్వ వైద్య సేవల విస్తరణకు మరో ముందడుగు పడింది. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అదనంగా 359 పీజీ సీట్లను కేటాయించేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటివరకు 1,266గా ఉన్న పీజీ సీట్ల సంఖ్య 1,625కు చేరింది.

గతంలో రాష్ట్రంలోని 10 ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే పీజీ కోర్సులు అందుబాటులో ఉండగా, తాజా అనుమతులతో ఆ సంఖ్య 23కు పెరిగింది. మొత్తం 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 23 చోట్ల పీజీ విద్య అందుబాటులోకి రానుంది. నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వనపర్తి, మంచిర్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, నిర్మల్, సంగారెడ్డి, నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తొలిసారిగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. కాలేజీల్లో అధ్యాపకుల నియామకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, అనుబంధ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాల కల్పనతో అదనపు సీట్లకు మార్గం సుగమమైంది. జాతీయ వైద్య కమిషన్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వసతులు మెరుగుపడటంతో ఈ అనుమతులు లభించాయి.

పీజీ సీట్ల పెంపుతో జిల్లా కేంద్రాల్లోనే వివిధ వైద్య విభాగాల నిపుణులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల సంఖ్య పెరిగితే స్థానిక ప్రజలకు మెరుగైన చికిత్స అందుతుంది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన రాష్ట్ర విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే ఉన్నత వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశాలు విస్తరిస్తాయి.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 1,625 పీజీ సీట్లతో పాటు నిమ్స్‌లో అదనంగా 107, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో 106 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ సుమారు 2,600 పీజీ సీట్లు ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి.





గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా హైదరాబాద్

- **'ఆర్థా ఫిన్‌టెక్' కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్, నవంబర్ 7 :

ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో పరిశోధన, అభివృద్ధి(ఆర్ అండ్ డీ)కి ప్రోత్సాహం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఆర్థా ఫిన్‌టెక్ హైదరాబాద్ కార్యాలయాన్ని హైటెక్ సిటీలో ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఐటీ/ఐటీఈఎస్ రంగంలో హైదరాబాద్ సాధించిన అంతర్జాతీయ గుర్తింపును ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకూ విస్తరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా పెట్టుబడులకు, ఆవిష్కరణలకు, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. గ్లోబల్ కంపెనీలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించేలా ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ ఎకోసిస్టం"ను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. బ్యాంకింగ్‌యాజ్ఏసర్వీస్, ఓపెన్ బ్యాంకింగ్ ఏపీఐలు, ఆటోమేటెడ్ ఆన్‌బోర్డింగ్, కేవైసీ/కేవైబీ, ఏఎంఎల్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్ మౌలిక సదుపాయాలు తదితర ఫైనాన్షియల్ టెక్నాలజీ పరిష్కారాలను ఆర్థా ఫిన్‌టెక్ అందిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ సీఈవో మధుబాబు గడిపాటి, ఆర్మిన్ ఒర్డోడరీ, ఇమాన్యుయేల్ సి.ఫెర్నాండెస్ తదితరులు పాల్గొన్నారు.

అంత కష్టపడితే విద్యుత్ సరఫరా ఏడు గంటలేనా?

మొదటిపేజీ తరువాయి

అధికారంలోకి వచ్చాక కొడంగల్‌లో రెండు 50 పడకల ఆసుపత్రులు కట్టించాం, ఫైర్ స్టేషన్ లేకపోతే కొత్తగా ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేశాం, ప్రతి తండాకు అద్భుతమైన బీటీ రోడ్లు వేశాం, రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చాం, మిషన్ కాకతీయ కింద కొడంగల్ చెరువులన్నీ బాగుచేశాం, మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రతి మండలానికి గోదాములు కట్టించామని కొడంగల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు హరీశ్ రావు సమాధానమిచ్చారు. సిద్దిపేటలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ మూడేళ్లలో నువ్వు సిద్దిపేటకు ఏం చేశావని ప్రశ్నించారు. ఒక్క ఇటుక పెట్టకపోగా, సిద్దిపేటలో మన పిల్లలు చదువుకునేందుకు మంజూరైన వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు ఎత్తుకుపోయావు! సిద్దిపేటలో వెయ్యి పడకల ఆసుపత్రి పనులను, నర్సింగ్ కాలేజీ పనులను మధ్యలోనే ఆపించావు.రంగనాయక సాగర్ కాలువలను మా ప్రభుత్వ హయాంలోనే 90 శాతం పూర్తి చేశాం. నరసింహ గుంట నింపే కాలువ లాంటివి అక్కడక్కడా కేవలం 10 శాతం పనులు మాత్రమే మిగిలి ఉండేవి.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లయినా ఆ మిగిలిన కాలుపల్లో తట్టెడు మట్టి కూడా తీయలేదు, ఏ ఊరిలోనూ గజం తారు రోడ్డు వేసిన పాపాన పోలేదని విమర్శించారు.

'ఈ మూడేళ్లలో నేను ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు, చంకలు కాలిపోయేలా కష్టపడ్డా, బక్కచిక్కిపోయా, నా అంత కష్టపడేవాడు ఎవడూ లేడు' అని కొడంగల్ సభలో సొంత డబ్బా కొట్టుకుంటున్నాడు.అయ్యా రేవంత్ రెడ్డీ.. నువ్వు పడ్డ కష్టం ప్రజలకు సేవ చేయడానికా లేక కమిషన్లు, పైసలు కొట్టడానికా? అని ప్రశ్నించారు. నువ్వు నిజంగానే ఒక్కరోజు సెలవు తీసుకోకుండా అంతగా కష్టపడితే.. కేసీఆర్ ఉన్నప్పుడు బాయిలకాడ 24 గంటలు వచ్చిన కరెంటు, ఇప్పుడు 78 గంటలకే ఎందుకు పడిపోయిందో చెప్పాలన్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రైతుల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు కాలిపోతున్నాయి?కేసీఆర్ ఉన్నప్పుడు రైతుకు నాలుగు యూరియా బస్తాలు కావాలంటే.. ఆటో డ్రైవర్‌కు చెప్తే సొసైటీకి పోయి నేరుగా బాయికాడికి తెచ్చి వేసేవాడు. మరి ఇవాళ రేవంత్ రెడ్డి పాలనలో యూరియా బస్తాల కోసం రైతులు చెప్పులు లైన్లో పెట్టాల్సిన దుస్థితి వచ్చింది..ఫోన్ పట్టుకుని యాప్‌లో యూరియా బుకింగ్ కోసం గంటల తరబడి ఒత్తుకుంటూ కూర్చోవాలి.. అది దొరికితే లాటరీ తగిలినట్టు, లేకపోతే లేదు ఇదేనా నువ్వు పడ్డ 24 గంటల కష్టం అంటూ ఎద్దేవా చేశారు. నాడు కరోనా మహమ్మారి వచ్చి ప్రపంచమంతా ఆగిపోయిన కష్టకాలంలో కూడా కేసీఆర్ రైతుబంధు ఆపకుండా వేశారు. మరి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా కష్టపడ్డానని చెప్పుకునే రేవంత్ రెడ్డి..రైతులకు ఇంకో రూపాయి ఎక్కువ ఇవ్వాలి గానీ, మూడు పంటలకు రైతుబంధు ఎందుకు ఎగ్గొట్టాడు? ఒకసారి ఎకరానికే వేసిండు, ఇంకోసారి రెండెకరాలకే వేసిండు, మరోసారి మొత్తానికే ఎగ్గొట్టిండని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఆడబిడ్డ కాన్పుకు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే.. పైసా ఖర్చు లేకుండా కానుపు చేసి, కేసీఆర్ కిట్ ఇచ్చి, లోపల బాలింతకు, బయట సహాయకులకు కడుపునిండా అన్నం పెట్టి ఆదుకున్నాం.కానీ రేవంత్ రెడ్డి వచ్చాక కేసీఆర్ కిట్ బంద్ పెట్టి, ప్రభుత్వ ఆసుపత్రులను ఆగం చేశాడు. మాటలు చెప్పడం కాదు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.



గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ

హైదరాబాద్, నవంబర్ 7:

గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీలు వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకునే సొంత ఆదాయాన్ని ఇకపై నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం-2026ను తీసుకొచ్చింది. అక్టోబర్ 9, 2026 నుంచి ఈ సవరణ అమల్లోకి వస్తుందని పేర్కొంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో ఎంఎస్ నెం. 43ను జారీ చేసింది. గతంలో గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకున్న ఆదాయాన్ని తొలుత ప్రభుత్వ ఖజానాలో జమ చేయాల్సి వచ్చేది. ఆ తర్వాత అవసరమైన నిధులను తిరిగి పొందేందుకు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండటంతో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురయ్యేవి. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల మరమ్మతులకు నిధులు అందడంలో జాప్యం జరిగేది. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం చట్ట సవరణ చేపట్టింది. కొత్త నిబంధనలతో పంచాయతీల సొంత ఆదాయం నేరుగా వాటి బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. దీంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించుకునే అవకాశం కలగనుంది. అత్యవసర అభివృద్ధి పనుల కోసం నిధుల విడుదలకు ఎదురుచూడాల్సిన పరిస్థితి తగ్గనుంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా చేపట్టేందుకు ఈ మార్పు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

- **అటవీ సంపదతోపాటు ఆదివాసీల జీవనోపాధికి ప్రాధాన్యం**
- **అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ సీఎస్‌తో మంత్రి సీతక్క సమీక్ష**

ములుగు, నవంబర్ 7 :

ములుగు జిల్లాలో విస్తారంగా ఉన్న అటవీ, ప్రకృతి సంపదను పరిరక్షిస్తూనే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానిక ఆదివాసీ గిరిజనులకు జీవనోపాధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. అటవీ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ములుగులో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ములుగు జిల్లాకు వచ్చిన జయేష్ రంజన్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి సీతక్కతో శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అటవీ ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ, ఎకో టూరిజం అభివృద్ధి, ఏజెన్సీ ప్రాంతాల మౌలిక వసతులు, ఆదివాసీ గిరిజనుల జీవనోపాధి తదితర అంశాలపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. జిల్లాకు ఉన్న ప్రత్యేక భౌగోళిక, ప్రకృతి వనరుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని మంత్రి సూచించారు. జిల్లాలోని దట్టమైన అడవులు, కొండలు, వాగులు, జలపాతాలు, సహజసిద్ధమైన ప్రకృతి ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని, అయితే పర్యాటక అభివృద్ధి పేరుతో అటవీ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు. ప్రకృతిని కాపాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో టూరిజం కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజలను, ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులను ఈ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించవచ్చునన్నారు. స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలు, ఆహార ఉత్పత్తులు తదితరాలను పర్యాటక రంగంతో అనుసంధానం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ములుగు ప్రకృతి సంపదను పరిరక్షించడంతో పాటు స్థానిక ప్రజల ఆదాయాన్ని పెంచే విధంగా అభివృద్ధి కొనసాగాలని అన్నారు. అటవీ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర అత్యవసర మౌలిక వసతుల కోసం చేపట్టే అభివృద్ధి పనులకు కేంద్ర అటవీ, పర్యావరణ అనుమతుల ప్రక్రియలో అనవసర జాప్యం లేకుండా చూడాలని కోరారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలకు మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని జయేష్ రంజన్‌ను మంత్రి కోరారు. జిల్లా ప్రకృతి సంపదను భవిష్యత్ తరాలకు కాపాడుతూ అదే సమయంలో అక్కడి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ దిశగా అటవీ, పర్యావరణ శాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓతోపాటు అటవీ, పర్యావరణ, జిల్లా పరిపాలనకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



దోచుకున్నది చాలక మళ్లీ అధికారం కోసం కలలు

హైదరాబాద్, నవంబర్ 7 :

పేదల కష్టనష్టాలను గమనించి గతంలో ఇందిరమ్మ ప్రభుత్వాలు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే బీఆర్ఎస్ పాలకులు పేదల ఇళ్లు, స్థలాలను కొల్లగొట్టారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధరణి పేరిట భూదోపిడీ, కాళేశ్వరం పేరిట అవినీతికి పాల్పడి రాష్ట్రానికి రూ.8.25లక్షల కోట్ల అప్పులు మిగిల్చిన ఆ ప్రభుత్వం కారణంగా నెలకు రూ.6,500 కోట్లను ప్రజాప్రభుత్వం వడ్డీ రూపేణా చెల్లిస్తోందని వివరించారు. రంగారెడ్డి జిల్లా నందిగామలో ఎంపీడీవో కార్యాలయ ప్రారంభం, ఎమ్మార్వో కార్యాలయ భవన శంకుస్థాపనతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి పొంగులేటి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కష్టపడుతుంటే మరో వైపు రానున్న కాలంలో తానే ముఖ్యమంత్రిని అవుతానన్న భ్రమతో ఓ ప్రముఖుడు ఇప్పటినుంచి ప్రమాణస్వీకారోత్సవంపై రిహార్సల్స్ వేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రెండేసి జిల్లాలను పంచుకుని దోపిడీకి పాల్పడిన నాటి మంత్రులు, ప్రముఖులు ఇప్పుడు కనీసం నాలుగేసి జిల్లాలు కావాలంటూ అప్పుడే ఆ నేతపై ఒత్తిడి తెస్తున్నారని, అయితే వారి కలలు కల్లలు కాక తప్పదని మంత్రి పొంగులేటి జోస్యం చెప్పారు. ముందు నీ నియోజకవర్గంలో గెలువు.. తర్వాత సీఎం పీఠం గురించి ఆలోచించవచ్చని ఆయనకు హితవు పలికారు. ప్రజా ప్రభుత్వంపై అబద్దాలు చెప్పకపోతే తల వేయి ముక్కలవుతుందన్న భయంతో ప్రతిపక్ష నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం విషయంలో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం భేషజాలకు పోదని, గత ప్రభుత్వపు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాల కొనసాగింపే దీనికి నిదర్శనమని అన్నారు. గత 33 నెలల్లో ఈ ప్రజా ప్రభుత్వం పేదలు ముఖ్యంగా మహిళల కోసం వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, రానున్న కాలంలో మరిన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ఇప్పటివరకు రూ.73వేల కోట్లను సున్నా వడ్డీకి డ్వాక్రా మహిళల ఖాతాల్లో వేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికి 2,25,100 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రానున్న కాలంలో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ తరుణంలో ఆనందోత్సాహాలు జరుపుకునేందుకు శనివారం నుంచి పూర్తయిన ఇళ్ల ముందు మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పేరిట కార్యక్రమాలు నిర్వహించాలని, దీనిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కమిటీల సభ్యులు అందరూ పాల్గొనాలని మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. ధరణి పేరిట గత ప్రభుత్వం దోచుకుంటే తాము భూ సమస్యే లేకుండా చేసేందుకు భూభారతి పేరిట సంస్కరణలు తెస్తున్నామని, ఏడాదిన్నరలో 10,456 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి ప్రతి భూమికి పట్టా, మ్యాప్‌లతోపాటు ఆధార్ నెంబర్ వలే భూధార్ నెంబర్ ఇస్తామని వెల్లడించారు. ఈనెల 19న సిద్దిపేట వేదికగా అద్భుతమైన చిలక పచ్చరంగు బతుకమ్మ చీరలను మహిళా లోకానికి అందిస్తామని చెప్పారు.

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే మా సంకల్పం

హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే గొప్ప సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇల్లు అనేది నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని, ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భరోసా కల్పించే చిరునామా అని పేర్కొన్నారు. పేదల కష్టాలను అర్థం చేసుకుని, వారి సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రూపొందించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యాచరణలో పెట్టి అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంపై సచివాలయంలో హౌసింగ్ అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు నివాసాన్ని కల్పించడమే కాక వారి కుటుంబాల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తుపై భరోసా నింపడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అందులో భాగంగానే మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమానికి రూపకల్పన చేశామని తెలిపారు. పేదల ఇళ్లలో వెలుగులు నింపుతూ వారి కుటుంబాలతో కలిసి పండుగ సంతోషాలను పంచుకోవాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు.

నందిగామ ప్రాంతానికి మంత్రి వరాల వెల్లువ

స్థానిక ఎమ్మెల్యే శంకరన్న అభ్యర్థన మేరకు ఈ ప్రాంతానికి ఒక ఆర్డీవో కార్యాలయ భవనం, ఎమ్మార్వో కార్యాలయ భవనం మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. సిద్దాపురంలో దంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా వేరే ప్రాంతానికి తరలిస్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. వెంగిరాలలోని భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వేదికపై నుంచే అధికారులను ఆదేశించారు. వెంజెళ్లలో కూడా భూసమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ద్వాక్రా మహిళల భవనంలోనూ, పాఠశాల ఆవరణలోనూ మహిళలు, విద్యార్థినీవిద్యార్థులతో మంత్రి ఫొటో దిగారు. పలువురు మహిళలకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. పర్యటనలో మంత్రికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరన్న, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



తొమ్మిదేళ్లుగా గంజాయి దందా..
నీతూబాయి అరెస్ట్

- **13 కేసుల్లో పరారీలో ఉన్న నిందితురాలు పట్టివేత**
- **సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు**
- **నిందితురాలి నుంచి రూ.1.59 లక్షల నగదు స్వాధీనం**
- **గచ్చిబౌలి, లంగర్‌హౌస్‌లో అక్రమ ఆస్తుల గుర్తింపు**
- **ఈగల్ ఫోర్స్ అధికారుల ప్రకటన**

హైదరాబాద్, నవంబర్ 7:

నగరంలో తొమ్మిదేళ్లుగా గంజాయి విక్రయాలు సాగిస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న నిందితురాలు కాలాపతి నీతూబాయి (48) ఎట్టకేలకు పట్టుబడింది. ఈగల్ ఫోర్స్ బృందం సాంకేతిక నిఘూతో ఆమెను మంగళ్‌హాట్ వైపు ఆటోలో వెళ్తుండగా అదుపులోకి తీసుకుంది. ఆమె నుంచి రూ.1.59 లక్షల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని 2017 నుంచి ఈ దందా నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దూల్‌పేటకు చెందిన నీతూబాయి నానక్‌రామ్‌గూడలోని లోధాబస్తీని కేంద్రంగా చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి గంజాయి విక్రయాలు సాగించినట్లు పోలీసులు గుర్తించారు. స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తూ దాని ముసుగులో వ్యాపారం కొనసాగించినట్లు తెలిపారు. ఆమెతో పాటు కుటుంబ సభ్యులపై 30కి పైగా ఎన్‌డీపీఎస్, ఎక్సైజ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 13 కేసుల్లో ఆమె పరారీలో ఉంది. గంజాయి విక్రయాల ద్వారా సంపాదించిన డబ్బుతో గచ్చిబౌలి, లంగర్‌హౌస్ ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించినట్లు విచారణలో తేలింది. 2023లో ఆమె అరెస్టు సమయంలో 16 బ్యాంకు ఖాతాల్లో రూ.1.53 కోట్ల నగదు ఉన్నట్లు గుర్తించారు. సుమారు రూ.2 కోట్ల విలువైన స్థిరాస్తులను కూడా గుర్తించి ఎన్‌డీపీఎస్ చట్టం కింద స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఈడీ సైతం ఆమె అక్రమ ఆస్తులపై దాడులు నిర్వహించి నగదు, గంజాయిని స్వాధీనం చేసుకుంది. 2024 మార్చిలో ఈగల్ ఫోర్స్ నిర్వహించిన ఆపరేషన్‌లో నీతూబాయి పట్టుబడగా, ఆమె నుంచి రూ.34.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పీడీ యాక్ట్ కింద జైలుకు పంపారు. బయటకు వచ్చిన తర్వాత కొంతకాలం అజ్ఞాతంలో ఉంటూ తిరిగి దందా ప్రారంభించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఏడాది జూన్‌లో నానక్‌రామ్‌గూడలోని ఆమె నివాసంపై దాడి చేసి గంజాయి కొనుగోలుకు వచ్చిన 47 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయితే అప్పట్లో నీతూబాయి తప్పించుకుంది. తాజాగా ఆటోలో వెళ్తుండగా ఆమెను అరెస్టు చేశారు.

డిండి నీటి సమస్యకు నదుల
అనుసంధానమే పరిష్కారం

- **ఏదుల నుంచి డిండికి నీళ్లు తేవడం అసాధ్యం**
- **బస్వాపూర్ మీదుగా గోదావరి జలాల తరలింపు**
- **పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి**
- **తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

నల్గొండ, నవంబర్ 7:



డిండి రిజర్వాయర్‌కు ఏదుల నుంచి నీటిని తరలిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రెండు జిల్లాల ప్రజలను మోసం చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఏదులకే రెండు టీఎంసీల నీటిని తీసుకురాలేని పరిస్థితుల్లో డిండికి ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. శనివారం డిండి రిజర్వాయర్ వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తన ప్రతిపాదనలను వివరించారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతోనే డిండి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ ద్వారా బస్వాపూర్ మీదుగా డిండికి నీటిని అందించవచ్చని తెలిపారు. బస్వాపూర్ పనులు 80 శాతం పూర్తయ్యాయని, వాటిని వేగంగా ముగించాలని సూచించారు. ఏదుల నుంచి నీటిని తరలించే ప్రతిపాదనకు అవసరమైన సర్వేలు, సాంకేతిక ఆధారాలు ఏమిటో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సార్లు సర్వేలు చేసినా డిండికి నీటి వనరును గుర్తించలేకపోయిందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీశైలాన్ని సోర్స్‌గా ఎంచుకోవడం కూడా తప్పిదమేనని అంగీకరిస్తూ, గత ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నందుకు క్షమాపణలు కోరారు. ఏటా గోదావరి నుంచి 3,500 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నా వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కొత్త ప్రతిపాదనలు చేపట్టడం సరికాదన్నారు. నల్గొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి దీర్ఘకాలం నదీ జలాలు అందించాలని, జిల్లాలో చిన్న రిజర్వాయర్లు నిర్మిస్తామని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పరిష్కారాలు సూచిస్తున్న తమ పార్టీ అభ్యర్థులకు పట్టభద్రులు మద్దతు ఇవ్వాలని కవిత కోరారు.

4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు

హైదరాబాద్, నవంబర్ 7న:

తెలంగాణలోని నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పండుగ కానుక అందించనుంది. ప్రజా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. నవంబర్ 8న వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొని, లబ్ధిదారులకు నూతన పింఛన్ల మంజూరు పత్రాలను అందజేయనున్నారు. సామాజిక భద్రతకు ప్రాధాన్యమిస్తూ కొత్త లబ్ధిదారుల ఎంపిక చేపట్టినట్లు మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత, గీత కార్మికులతో పాటు ఇతర అర్హులకు ఈ పింఛన్లు అందనున్నాయి. కోడంగల్‌లో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ పంపిణీ చేపట్టనున్నారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు.

కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు నవంబర్ నెల నుంచే పింఛన్ సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా పింఛన్లు అందిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. కొత్త పింఛన్ల మంజూరుతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది.



ఐఏఎఫ్ ప్రపంచ రికార్డు

- న్యోమాలో భారీ సైనిక విమానం ల్యాండింగ్..
- 13,629 అడుగుల ఎత్తులో ఐఎల్-76ఎండీ ల్యాండింగ్
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఘనత
- చైనా సరిహద్దుకు సమీపంలో వ్యూహాత్మక స్థావరం
- మూడు కిలోమీటర్ల కాంక్రీట్ రన్‌వే అందుబాటులోకి
- భారత వాయుసేన అధికారిక ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 7:

భారత వాయుసేన (ఐఏఎఫ్) మరో అరుదైన ఘనత సాధించింది. తూర్పు లద్దాఖ్‌లోని న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో భారీ సైనిక రవాణా విమానం ఐఎల్ 76ఎండీని విజయవంతంగా ల్యాండ్ చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది. సముద్ర మట్టానికి 13,629 అడుగుల ఎత్తులో ఉన్న ఈ రన్‌వేపై ఇంత భారీ రవాణా విమానం దిగడం ఇదే తొలిసారి. ప్రతికూల వాతావరణం, పర్వత ప్రాంతాల్లోని క్లిష్ట పరిస్థితులను అధిగమించి పైలట్లు ఈ ఘనత సాధించారు. సిబ్బంది నైపుణ్యం, కఠోర శిక్షణ, సమన్వయంతోనే ఇది సాధ్యమైందని వాయుసేన వెల్లడించింది. చైనా వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ)కి అత్యంత సమీపంలో ఉన్న న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌కు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యం ఉంది. 2020లో భారత్‌చైనా సరిహద్దు ఉద్రిక్తతల అనంతరం ఈ ప్రాంతంలో రక్షణ మౌలిక వసతుల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించింది. ఇందులో భాగంగా 2021లో రూ.214 కోట్ల అంచనా వ్యయంతో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధి ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. బలగాలు, ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రిని సరిహద్దు ప్రాంతాలకు వేగంగా తరలించేందుకు ఈ స్థావరం ఉపయోగపడనుంది. గతంలో మట్టి రన్‌వేగా ఉన్న ఈ ఎయిర్‌ఫీల్డ్‌ను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం మూడు కిలోమీటర్ల పొడవైన కాంక్రీట్ రన్‌వే అందుబాటులోకి వచ్చింది. మైనస్ 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే శీతాకాలంలోనూ కార్యకలాపాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. న్యోమా స్థావరం అందుబాటులోకి రావడంతో లద్దాఖ్‌లో వాయుసేనకు మరో కీలక కేంద్రం సమకూరినట్లయింది. ఇప్పటికే లేహ్, కార్గిల్, థోయిస్‌లలో ఐఏఎఫ్‌కు వైమానిక స్థావరాలు ఉన్నాయి.

ఇందిర హత్య.. రాజీవ్ ప్రధాని పదవిపై సోనియా ఆవేదన

- ఇందిర మరణించిన రోజే రాజీవ్‌కు ప్రధాని బాధ్యతలు
- పదవి చేపడితే ప్రాణాలకు ముప్పని సోనియా ఆందోళన
- 'పదవి చేపట్టకపోయినా చంపేస్తారు' అన్న రాజీవ్
- ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో కీలక విషయాలు
- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ

న్యూఢిల్లీ, నవంబర్ 7:

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ తన ఆత్మకథలో వెల్లడించారు. ఇందిర హత్య జరిగిన రోజే రాజీవ్ గాంధీని ప్రధానిగా బాధ్యతలు చేపట్టాలని కోరినప్పుడు తనకు గుండెల్లో కత్తి దిగినంత బాధ కలిగిందని ఆమె గుర్తుచేసుకున్నారు. ప్రధాని పదవి చేపడితే ఆయన ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని, ఆ బాధ్యతలు స్వీకరించవద్దని రాజీవ్‌ను వేడుకున్నట్లు తెలిపారు. అందుకు రాజీవ్ స్పందిస్తూ.. తాను పదవి చేపట్టకపోయినా తనను చంపేస్తారని చెప్పినట్లు వివరించారు.

సోనియా గాంధీ రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకాన్ని హార్పర్‌కాలిన్స్ ఇండియా ప్రచురిస్తోంది. నవంబర్ 10న ఇది మార్కెట్లోకి రానుంది. పుస్తకంలోని కొన్ని భాగాలను బ్రిటన్ పత్రిక 'ది గార్డియన్' ప్రచురించడంతో ఇందిర హత్యకు సంబంధించిన జ్ఞాపకాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి.

1984 అక్టోబర్ 31న ఇందిరా గాంధీ తన నివాసం 1, సఫ్దర్‌జంగ్ రోడ్‌లో భద్రతా సిబ్బంది కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో తాను విన్న పేలుళ్ల శబ్దాలు మొదట టపాసుల మాదిరిగా అనిపించాయని సోనియా రాశారు. పిల్లల నానీ ఒంగ్మో ఆందోళనతో వచ్చి విషయం చెప్పడంతో తాను తోటవైపు పరుగెత్తినట్లు తెలిపారు. రక్తంతో ఉన్న ఇందిరను తెల్ల అంబాసిడర్ కారులో ఆస్పత్రికి తరలిస్తుండగా చూశానని పేర్కొన్నారు.

ఆస్పత్రికి వెళ్లే మార్గంలో భారీ ట్రాఫిక్ కారణంగా కారు నెమ్మదిగా కదిలిందని, సైరన్ కూడా లేదని గుర్తుచేసుకున్నారు. అక్కడికి చేరుకున్నాక రాజీవ్, పిల్లలు ఎక్కడ ఉన్నారనే ఆందోళన వెంటాడిందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు వైద్యులు ఇందిర మరణాన్ని ప్రకటించడంతో తట్టుకోలేక ఏడ్చానని తెలిపారు. ఇంటికి చేరుకున్నాక రాహుల్, ప్రియాంక కన్నీళ్లతో తనను కౌగిలించుకున్నారని, దాదికి ఏమైందని, పాపా ఎక్కడని ప్రశ్నించారని పుస్తకంలో వివరించారు.

ఇదిలా ఉండగా, తన ఆత్మకథ ప్రచురణ విషయంలో ఎదురైన పరిణామాలపైనా



సోనియా స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై పుస్తకంలో చేసిన విమర్శల పట్ల పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా అసోకర్యానికి గురైందని ఆరోపించారు. తొలుత ప్రచురణపై ఆసక్తి చూపిన సంస్థ తర్వాత భారత్‌లో పుస్తకాన్ని విడుదల చేయలేమని వెనక్కి తగ్గడం నిరాశ కలిగించిందని పేర్కొన్నారు.

పెట్రోల్‌లో ఇథనాల్ మోతాదుపై రాహుల్ ఫైర్

- '20 కాదు.. 420' అంటూ కేంద్రంపై విమర్శలు
- 14 నమూనాల్లో 11లో 20 శాతానికి మించి ఇథనాల్
- ఒక నమూనాలో అత్యధికంగా 31.2 శాతం నమోదు
- మైలేజీ తగ్గుదల, వాహనాల మరమ్మతులపై ఆందోళన

న్యూఢిల్లీ, నవంబర్ 7:

పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం అంశం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 20 శాతం లక్ష్యానికి మించి కొన్ని ప్రాంతాల్లో ఇథనాల్ కలుపుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిపై సోషల్ మీడియాలో స్పందిస్తూ '20 కాదు.. 420' అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.

కర్ణాటకలోని ఏడు జిల్లాల్లో పెట్రోల్ బంకుల నుంచి సేకరించిన 14 నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో పరీక్షించగా.. 11 నమూనాల్లో 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు వెల్లడైందని రాహుల్ తెలిపారు. కొన్ని నమూనాల్లో ఈ మోతాదు 26 నుంచి 31 శాతం వరకు నమోదైందన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పేర్కొన్నారు. భారత్ పెట్రోలియం, నయారా, షెల్ సంస్థల నమూనాల్లోనూ పరిమితికి మించి మిశ్రమం ఉన్నట్లు ఆరోపించారు.



అధిక ఇథనాల్ మిశ్రమం వల్ల వాహనాల మైలేజీ తగ్గడంతో పాటు మరమ్మతుల ఖర్చులు పెరిగే అవకాశం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని వాహనాలు అధిక ఇథనాల్ మిశ్రమానికి అనుకూలంగా ఉండవని పేర్కొన్నారు. పెట్రోల్‌లో ఇథనాల్ శాతం ఎంత ఉందనే వివరాలను బంకుల్లో వినియోగదారులకు వెల్లడించడం లేదని విమర్శించారు. ఇంధనంలో కలిపే పదార్థాల గురించి తెలుసుకునే హక్కు వాహనదారులకు ఉందన్నారు.

నిర్దేశిత పరిమితిని మించి ఇథనాల్ కలుపుతున్న కంపెనీలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రాహుల్ ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్ ట్యాంకుల్లో వాస్తవంగా ఏ ఇంధనం నింపుతున్నారని నిలదీశారు. ప్రధానమంత్రికి తాను విసిరిన బహిరంగ చర్చ సవాల్‌లో ఈ అంశాన్ని కూడా ప్రస్తావిస్తానని వెల్లడించారు.

దిల్లీ నుంచి కొచ్చికి సీఈసీ వ్యతిరేక ఉద్యమం

- ఎస్ఐఆర్ ను రద్దు చేయాలని కేరళలో సీజేపీ భారీ నిరసన
- ప్రకాశ్ రాజ్ నేతృత్వంలో ప్రదర్శన
- సుమారు 500 మంది పాల్గొన్నట్లు నిర్వాహకుల వెల్లడి
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా వరకు పోరాడుతాం: అభిజీత్

కొచ్చి/దిల్లీ, నవంబర్ 7:



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న ఉద్యమం శనివారం కేరళలోని కొచ్చికి విస్తరించింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'జంతర్ మంతర్ ఎట్ కొచ్చి' కార్యక్రమంలో నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ నేతృత్వంలో నిరసన ప్రదర్శన జరిగింది. సుమారు 500 మంది కార్యకర్తలు పాల్గొన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కొచ్చిలోని మెరైన్ డ్రైవ్ నుంచి రాజేంద్ర మైదాన్ వరకు జాతీయ పతాకాలతో నిరసనకారులు ప్రదర్శన నిర్వహించారు. డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) కేరళ రాష్ట్ర అధ్యక్షురాలు చింతా జెరోమ్ కూడా పాల్గొన్నారు. ప్రదర్శన మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం మధ్యాహ్నం కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ, దేశంలో స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేసే ఎన్నికల వ్యవస్థ ఏర్పడే వరకు జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ హయాంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయనే నమ్మకం లేదని ఆరోపించారు. ఒక రాజకీయ పార్టీకి ప్రయోజనం కలిగించేలా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని విమర్శించారు. కేరళలో తమ సంస్థకు యువత నుంచి గణనీయమైన మద్దతు ఉందని దీప్కే పేర్కొన్నారు. కొచ్చి కార్యక్రమానికి స్థానిక నిర్వాహకులు, ప్రకాశ్ రాజ్ ఆహ్వానం మేరకు వచ్చినట్లు తెలిపారు.

బెంగళూరు సామూహిక హత్యల్లో మైనర్ బాలిక పాత్రపై అనుమానాలు

- ఏడుగురి హత్యల్లో తండ్రికి సహకరించినట్లు ఆరోపణలు
- కుటుంబ సభ్యులను ఇంటికి రప్పించేందుకు ఫోన్లు
- హత్యల అనంతరం రక్తపు మరకలు, ఆధారాల తొలగింపు
- మృతదేహాల తరలింపులోనూ సహకరించినట్లు అనుమానం
- పోలీసుల అదుపులో 17 ఏళ్ల బాలిక

బెంగళూరు, నవంబర్ 7:

బెంగళూరులో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురి హత్య కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘాతుకానికి పాల్పడిన క్యాబ్ డ్రైవర్ ఇందుశేఖర్ అలియాస్ శేఖర్ 17 ఏళ్ల కుమార్తె పాత్రపైనా పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హత్యలకు ప్రణాళిక రూపొందించడం మొదలు ఆధారాలు చెరిపివేయడం వరకు ఆమె తండ్రికి సహకరించినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలికను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



పోలీసుల అనుమానాల ప్రకారం.. ఇందుశేఖర్ తన కుమార్తెను మానసికంగా ప్రభావితం చేసి ఈ నేరంలో భాగస్వామిని చేసినట్లు తెలుస్తోంది. తన భార్యతోపాటు కుటుంబ సభ్యులంతా శత్రువులని, వారిని అంతమొందిస్తే ఆస్తి తమకే దక్కుతుందని ఆమెను నమ్మించినట్లు సమాచారం. భార్య సునీతను హత్య చేసిన అనంతరం కుటుంబంలోని ఇతర సభ్యులను ఇంటికి రప్పించేందుకు కుమార్తెతోనే ఫోన్లు చేయించినట్లు పోలీసులు భావిస్తున్నారు. నానమ్మ రూపావతితోపాటు పిన్నులు, బాబాయ్‌ల కుటుంబాలను విందు పేరుతో ఇంటికి ఆహ్వానించినట్లు అనుమానిస్తున్నారు. ఆ సమయంలో తల్లి ఊరికి వెళ్లిందని చెప్పి బంధువులను నమ్మించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది.

అక్టోబర్ 16 నుంచి 31 మధ్య సుమారు 15 రోజుల వ్యవధిలో ఏడుగురిని వేర్వేరు సందర్భాల్లో ఇంటికి రప్పించి ఇందుశేఖర్ హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతి హత్య అనంతరం ఘటనాస్థలంలో రక్తపు మరకలను శుభ్రం చేయడం, ఇతర ఆధారాలను తొలగించడంలో కుమార్తె సహకరించినట్లు ఆరోపణలున్నాయి. మృతదేహాలను ప్యాక్ చేసి కారులో వేర్వేరు ప్రాంతాలకు తరలించి పడేయడంలోనూ ఆమె పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు. కారులో కుమార్తె ఉండటంతో పోలీసులకు అనుమానం రాదనే ఉద్దేశంతో నిందితుడు ఆమెను వెంట తీసుకెళ్లినట్లు భావిస్తున్నారు.మరోవైపు హత్యకు గురైన వారి మొబైల్ ఫోన్లను తమ వద్దే ఉంచుకుని, వారు క్షేమంగా ఉన్నట్లు ఇతరులకు సందేశాలు పంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. టూర్‌కు వెళ్లామని, అంతా బాగానే ఉన్నామని మృతుల ఫోన్ల నుంచి మెసేజ్‌లు పంపుతూ హత్యల విషయం బయటపడకుండా జాగ్రత్తపడినట్లు సమాచారం. ఈ సందేశాలు పంపడంలోనూ బాలిక సహకరించిందా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

పార్కింగ్ వివాదం.. టెక్ కంపెనీ మాజీ అధికారి హత్య

- ఫరీదాబాద్‌లో పారుగింటి వ్యక్తి కాల్పులు
- లైసెన్స్‌డ్ పిస్టల్‌తో 15 రౌండ్లు ఫైర్
- తొమ్మిది బుల్లెట్లు తగిలి అక్కడికక్కడే మృతి

ఫరీదాబాద్, నవంబర్ 7:

పార్కింగ్ స్థలం విషయంలో తలెత్తిన వివాదం ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. హర్యానాలోని ఫరీదాబాద్‌లో టెక్ రంగానికి చెందిన సీనియర్ అధికారి పరమ్‌జీత్ ధన్‌ఖర్ పొరుగింటి వ్యక్తి జరిపిన కాల్పుల్లో మృతి చెందారు. మేనల్లుడి వివాహానికి హాజరయ్యేందుకు సింగపూర్ నుంచి వచ్చిన ఆయనపై నిందితుడు తన లైసెన్స్‌డ్ పిస్టల్‌తో సుమారు 15 రౌండ్లు కాల్పులు జరిపాడు. వీటిలో తొమ్మిది బుల్లెట్లు తగలడంతో పరమ్‌జీత్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. పోలీసుల కథనం ప్రకారం.. పరమ్‌జీత్ గతంలో టెక్ మహీంద్రా ఆసియా కార్యకలాపాలకు నాయకత్వం వహించారు. ప్రస్తుతం వియత్నాంకు చెందిన ఓ సంస్థలో పనిచేస్తున్నట్లు తెలిసింది. మేనల్లుడి పెళ్లి కోసం రెండు రోజుల క్రితం ఫరీదాబాద్‌కు చేరుకున్నారు. శుక్రవారం రాత్రి జిమ్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన ఆయనకు తన పార్కింగ్ స్థలంలో పొరుగింటి వ్యక్తి మోహన్ అలియాస్ మోను శర్మ కారు కనిపించింది. అక్కడి నుంచి కారును తొలగించాలని పరమ్‌జీత్ కోరడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన మోహన్ తన వద్ద ఉన్న లైసెన్స్‌డ్ పిస్టల్‌తో పరమ్‌జీత్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. గతంలోనూ పెంపుడు కుక్కను పార్కింగ్ ప్రదేశంలోకి తీసుకురావడం సహా ఇతర అంశాలపై ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగినట్లు తెలిపారు. కాల్పుల అనంతరం నిందితుడు తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్రైమ్ బ్రాంచ్, ఫోరెన్సిక్ బృందాలు అక్కడి నుంచి ఖాళీ తూటాలను సేకరించాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న మోహన్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

సైనికులతో దీపావళి వేడుకల్లో రాజ్‌నాథ్ సింగ్

- బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో వాయుసేనతో వేడుకలు
- సిబ్బందికి మిఠాయిలు పంపిణీ
- ఆపరేషన్ సింధూర్‌తో వాయుసేన సత్తా చాటిందని వ్యాఖ్య
- డ్రోన్లు, సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

బాగ్‌డోగ్రా, నవంబర్ 7:

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పశ్చిమబెంగాల్‌లోని బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో భారత వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైనికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వైమానిక దళ సిబ్బంది ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, దేశం పట్ల అంకితభావాన్ని కొనియాడారు. సరిహద్దుల్లో సాయుధ దళాలు నిరంతరం కాపలా కాస్తుండటం వల్లే దేశ ప్రజలు పండుగలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరుపుకోగలుగుతున్నారని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. సైనికుల నిస్వార్థ సేవలు, తెగువ పట్ల యావత్ దేశం గర్విస్తోందన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత వాయుసేన సామర్థ్యం ప్రపంచానికి వెల్లడైందని చెప్పారు.

సైనికుల్లో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే ఎంతటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా ప్రయోజనం ఉండదని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. క్రమశిక్షణ సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా తీర్చిదిద్దుతుందని అన్నారు. ఇదే సమయంలో మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా సాయుధ దళాలను ఆధునిక సాంకేతికతతో సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్ల వినియోగం, సైబర్ భద్రత వంటి నూతన రంగాల్లో సైనికులు నైపుణ్యాలు పెంపొందించుకుంటున్నారని వివరించారు. భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానమే కీలక ఆయుధంగా మారనున్న నేపథ్యంలో భారత దళాలు మరింత సామర్థ్యం సాధించాలని ఆకాంక్షించారు. సైనికుల సహకారంతో దేశం రక్షణ రంగంలో మరింత పురోగతి సాధిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ సామర్థ్యం పెరుగుతుండటంపై హర్షం వ్యక్తం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల ఫలితంగా దేశీయ స్టార్టప్‌లు, పరిశ్రమలు డ్రోన్లు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, సైనికులకు అవసరమైన ఆధునిక పరికరాలను అభివృద్ధి చేస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.





గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు కీలకం

- **నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి**
- **ప్రతి గ్రామంలో కమ్యూనిటీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**
- **కేశవపట్నం ఎస్సై కె. శేఖర్ రెడ్డి**

శెనార్తి మీడియా శంకరపట్నం:



గ్రామాల్లో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, ఇతర నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని కేశవపట్నం ఎస్సై కె. శేఖర్ రెడ్డి తెలిపారు. నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంతో పాటు దర్యాప్తునకు అవసరమైన ఆధారాల సేకరణలో కెమెరాల ఫుటేజీ ఉపయోగపడుతుందని వివరించారు. శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామంలో సర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు కమ్యూనిటీ సీసీ కెమెరాలను హుజూరాబాద్ రూరల్ సీఐ ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాలను పర్యవేక్షించేలా వీటిని ఏర్పాటు చేశారు. ప్రజల భద్రత కోసం ముందుకొచ్చిన సర్పంచ్, పాలకవర్గ సభ్యులను సీఐ అభినందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. దుకాణాలు, షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థల యజమానులు కూడా నాణ్యమైన కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత, సురక్షిత గ్రామాలను నిర్మించగలమని ఎస్సై పేర్కొన్నారు.

బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

- **అత్యవసర సేవలకు 108కు కాల్ చేయాలి**
- **పండుగ సమయంలో అప్రమత్తంగా ఉండనున్న అంబులెన్స్ సిబ్బంది**
- **ఉమ్మడి కరీంనగర్ జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్**

శెనార్తి మీడియా శంకరపట్నం:

దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య సురక్షితంగా జరుపుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ సూచించారు. బాణాసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు లేదా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ కేశవపట్నంలోని 108 అంబులెన్స్ ను తనిఖీ చేశారు. పండుగ సమయంలో ప్రతి మండలంలో అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండి అత్యవసర సేవలు అందిస్తారని తెలిపారు. బాణాసంచా కాల్చేటప్పుడు చెప్పులు ధరించాలని, కంటి అద్దాలు, మాస్కులు ఉపయోగించాలని భూమా నాగేందర్ సూచించారు. చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, చేతులతో టపాసులు పేల్చవద్దని తెలిపారు. అధికంగా బాణాసంచా కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరిగి శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో 108కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 108 ఈఎంటీ గూడూరి సతీష్ రెడ్డి, పైలట్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌పై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది: ఏఐవైఎఫ్



శెనార్తి మీడియా బెజ్జంకి

మోడల్ స్కూల్‌లో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందని ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు. విద్యార్థుల భద్రత, పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై ఉన్నతస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రస్తుత సిబ్బందిని మార్చి సమర్థులైన కొత్త సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.అలాగే మండల విద్యాధికారి పర్యవేక్షణ లోపాన్ని కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించి, విద్యార్థులకు భద్రతతో కూడిన విద్యా వాతావరణం కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

దీటి రాజుకు మాజీ ఎంపీ సన్మానం

శెనార్తి మీడియా, బెజ్జంకి :

సిద్దిపేట జిల్లా తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ దీటి రాజును తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రజక సమాజ ఐక్యత, హక్కుల సాధన, సంఘం బలోపేతానికి దీటి రాజు చేస్తున్న కృషిని నాయకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు,జీవి రామకృష్ణారావు,సిద్ధం వేణు,కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి,లింగాల లక్ష్మణ్,దుంబాల రాజ మహేందర్ రెడ్డి,బెజ్జంకి సర్పంచ్ బొల్లం పెద్దన్న,దీటీ బాలనర్సు,ఎలుక దేవయ్య తదితరులు పాల్గొన్నారు. తనను సన్మానించిన బోయినపల్లి వినోద్ కుమార్‌కు దీటి రాజు కృతజ్ఞతలు తెలిపారు.





విజన్ హైస్కూల్ లో ముందస్తు దీపావళి వేడుకలు

శెనార్తిమీడియా, కొత్తపల్లి : కొత్తపల్లి మండలం రేకుర్తి విజన్ హైస్కూల్ లో ముందస్తు దీపావళి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి రకరకాల దీపాలతో స్కూల్లో దీపాలంకరణ చేశారు. దీపావళి పండుగ నేపథ్యంలో విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటిక అందరినీ అలరించాయి. అనంతరం స్కూల్ కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులందరూ టపాసులకు దూరంగా ఉంటూ గ్రీన్ దీపావళిని జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సందవేణి వెంకట్, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, టీచర్స్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం



- **ఇందిరమ్మ ఇంట్లో తొలి దీపావళి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్**
- **రాష్ట్రవ్యాప్తంగా 2.30 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి**
- **కరీంనగర్ జిల్లాలో 3,416 ఇళ్ల నిర్మాణాలు పూర్తి**

శెనార్తి మీడియా, కరీంనగర్:

పదేళ్ల నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరడంతో ఆ కుటుంబంలో దీపావళి ఆనందం రెట్టింపైంది. ఇందిరమ్మ ప్రభుత్వం మంజూరు చేసిన ఇంట్లో తొలి పండుగ జరుపుకుంటున్న లబ్ధిదారు కుటుంబంతో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం రాత్రి వేడుకల్లో పాల్గొన్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పట్టణంలోని కట్టరాంపూర్‌లో గుండా సంధ్యారాణి కుటుంబంతో కలిసి దీపావళి జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందించి సత్కరించారు. అనంతరం వారితో కలిసి టపాసులు కాల్చారు. పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన తమకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడంతో తొలి దీపావళిని సొంత గూటిలో జరుపుకోవడం ఆనందంగా ఉందని సంధ్యారాణి కుటుంబ సభ్యులు తెలిపారు.

అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 2.30 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని వెల్లడించారు. గత పదేళ్లలో పేదలకు ఇళ్ల కేటాయింపులు లేకపోవడంతో గృహాల కోసం డిమాండ్ పెరిగిందన్నారు. తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. అర్హులైన పేదలందరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

జిల్లాలో 3,416 ఇళ్ల నిర్మాణాలు పూర్తి

కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు 3,416 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 415, జమ్మికుంటలో 138, చొప్పదండి మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలో 215, హుజూరాబాద్‌లో 144 ఇళ్లు పూర్తయినట్లు వివరించారు. జిల్లాలో మరో ఐదు వేల ఇళ్ల నిర్మాణాలు త్వరలోనే పూర్తవుతాయని చెప్పారు. కొత్త ఇంట్లో తొలి దీపావళి జరుపుకుంటున్న లబ్ధిదారుల ఆనందం ప్రభుత్వానికి సంతృప్తినిస్తోందని పేర్కొంటూ అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

జీవితంలో మరిచిపోలేని అనుభూతి

తమ కుటుంబానికి సొంతింటి కల సాకారమవడం ఎంతో సంతోషంగా ఉందని లబ్ధిదారు గుండా సంధ్యారాణి అన్నారు. ముఖ్యమంత్రి రేవంతన్న సహకారంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్, స్థానిక కార్పొరేటర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు తమ ఇంటికి వచ్చి కుటుంబంతో కలిసి దీపావళి జరుపుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, స్థానిక కార్పొరేటర్ ఆకుల నర్మద, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఇతర కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.







అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు వృథా

- **రోడ్డుపై పారుతున్న విలువైన నీరు**
- **సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తుల విజ్ఞప్తి**

శెనార్తి మీడియా శంకరపట్నం:



శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిష్కిందపల్లిలో తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు ప్రజలు తాగునీటి అవసరాలతో ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు విలువైన నీరు వృథా కావడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల అధికారులు వెంటనే స్పందించి నీటి వృథాను అరికట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరి సాగులో శాస్త్రీయ పద్ధతులపై అవగాహన



- **నీటి, ఎరువుల యాజమాన్యంపై సూచనలు**
- **సాగు ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు సాధించాలి**

శెనార్తి మీడియా శంకరపట్నం:

రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను పాటిస్తూ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఏటీఎంఏ కార్యక్రమంలో భాగంగా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో రైతు క్షేత్ర పాఠశాల (ఎఫ్ఎఫ్ఎస్) ఆధ్వర్యంలో వరి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వరి సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు, నీటి నిర్వహణ, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, చీడపీడలు, తెగుళ్ల నియంత్రణ చర్యలపై రైతులకు వివరించారు. పొలంలో పంట పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్, ఏటీఎంఏ చైర్మన్ రవి, శంకరపట్నం మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఏటీఎంలు, రైతులు పాల్గొన్నారు.

పాకాల చెల్మారెడ్డికి ఘన నివాళి



శెనార్తి మీడియా బెజ్జంకి:

బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి తండ్రి పాకాల చెల్మారెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరీంనగర్ మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాకాల మహిపాల్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, మాజీ ఎంపీపీ చింతలపల్లి రవీందర్ రెడ్డి, సర్పంచులు బొల్లం శ్రీధర్ పెద్దన్న, ఎర్ర వెల్లి శ్రీనివాస్, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, ముక్కిస తిరుపతి రెడ్డి, ముక్కిస రాజిరెడ్డి, కచ్చు రాజయ్య, దుంబాల రాజా మహేందర్ రెడ్డి, అన్నాడి సత్యనారాయణ రెడ్డి, దారం తిరుపతి రెడ్డి, చెలుకల తిరుపతి రెడ్డి, ధీటి బాలనర్సు, కోమిరె మల్లేశం గౌడ్, ఎల శేఖర్ బాబు, రాగుల మొండయ్య, కరివేద దేవేందర్ రెడ్డి, ముక్కిస అంజిరెడ్డి, లింగాల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో దీపావళి కొత్త వెలుగులు నింపాలి

- **కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగ జరుపుకోవాలి**
- **పర్యావరణహితంగా, సురక్షితంగా సంబరాలు చేసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

శెనార్తి మీడియా, కరీంనగర్: దీపావళి పండుగ ప్రతి ఇంటా ఆనందం, సంతోషం, సిరిసంపదలు నింపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకాంక్షించారు. పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళిని కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, వెలుగులు నింపాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. పండుగ వేళ పర్యావరణ పరిరక్షణపై కూడా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కాలుష్యం తగ్గించేలా జాగ్రత్తలు పాటించాలని, బాణసంచా కాల్చే సమయంలో చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు, పెద్దలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలంతా సురక్షితంగా, పర్యావరణహితంగా దీపావళి వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.



విలక్షణ నటుడు తుత్తి సుబ్రహ్మణ్యం

నేడు ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం వర్ధంతి

కొందరు నటులు తమ నటనతో నవ్విస్తారు. మరికొందరు తమ హావభావాలతో అలరిస్తారు. ఇంకొందరు పలికే ఒక్క మాటతోనే ప్రేక్షకుల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతారు. అలాంటి అరుదైన హాస్య నటుల్లో ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం ఒకరు. తెలుగు సినీ ప్రేక్షకులకు ఏవీఎస్‌గా సుపరిచితుడైన ఆయన 'తుత్తి' అనే ఒక్క పదంతోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. విలక్షణమైన సంభాషణల ఉచ్చారణ, విభిన్నమైన హావభావాలు, సహజమైన నటనతో తెలుగు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారు. రంగస్థల నటుడిగా ప్రారంభమైన ఆయన కళాప్రస్థానం మిమిక్రీ కళాకారుడిగా, పాత్రికేయుడిగా, సినీనటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా విస్తరించింది. 2013 నవంబర్ 8న కన్నుమూసిన ఏవీఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన కళాప్రస్థానాన్ని మరోసారి స్మరించుకోవాల్సిన సందర్భమిది. ఏవీఎస్ 1957 జనవరి 2న గుంటూరు జిల్లా తెనాలిలో వీరరాఘవయ్య, శివకామేశ్వరి దంపతులకు జన్మించారు. తెనాలిలోని వీఎస్‌ఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. కళాశాల రోజుల్లోనే రంగస్థలంపై అడుగుపెట్టి నాటకాల్లో విభిన్న పాత్రలు పోషించారు. రసమయి సంస్థను ఏర్పాటు చేసి నవరస ప్రదర్శనలు నిర్వహించారు. మిమిక్రీ కళాకారుడిగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. లలిత కళా సమాఖ్య ద్వారా కళా కార్యక్రమాలు, ప్రముఖుల సన్మాన సభలు నిర్వహించారు. అనంతరం పాత్రికేయ రంగంలోకి ప్రవేశించి ఉదయం, ఆంధ్రజ్యోతి పత్రికల్లో విలేకరిగా, ఉపసంపాదకుడిగా పనిచేశారు. ఈ క్రమంలో దర్శకుడు బాపు దృష్టిలో పడటంతో సినీరంగ ప్రవేశానికి మార్గం సుగమమైంది. ఎన్టీఆర్ నిర్మించిన 'శ్రీనాథ కవిసార్వభౌముడు' చిత్రంలో నటించినప్పటికీ, ముందుగా విడుదలైన 'మిస్టర్ పెళ్లాం' (1993) చిత్రంతో ఏవీఎస్ ప్రేక్షకులకు పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే ఉత్తమ హాస్య నటుడిగా నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ చిత్రంలో ఆయన పలికిన 'తుత్తి' అనే పదం విశేష ఆదరణ పొందింది. 'ఘటోత్కచుడు' చిత్రంలోని 'రంగుపడుద్ది', 'శుభలగ్నం' చిత్రంలోని 'గాలి కనపడుతుందా' వంటి సంభాషణలు కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాటల ఉచ్చారణ, ముఖ కవళికలు, శరీర భాషతో హాస్యాన్ని పండించడంలో ఏవీఎస్ తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. దాదాపు 19 ఏళ్ల సినీ ప్రస్థానంలో ఏవీఎస్ సుమారు 500 చిత్రాల్లో నటించారు. 'మాయలోడు', 'మేడమ్', 'ఆమె', 'శుభలగ్నం', 'యమలీల', 'వినోదం', 'సమరసింహారెడ్డి', 'ఇంద్ర', 'ధర్మచక్రం', 'గంగోత్రి', 'శివమణి', 'వెంకీ', 'శ్రీరామదాసు', 'జై చిరంజీవ', 'కింగ్', 'బెండు అప్పారావు', 'ఝుమ్మంది నాదం' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలతో మెప్పించారు. హాస్య పాత్రలతోపాటు సహాయ నటుడిగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ రాణించారు. పౌరాణిక చిత్రాల్లో శకుని, నారదుడు వంటి పాత్రలను పోషించారు. 'పవిత్ర' ఆయన చివరి చిత్రంగా గుర్తింపు పొందింది. నటనతోపాటు దర్శకత్వం, నిర్మాణం, రచన రంగాల్లోనూ ఏవీఎస్ ప్రతిభ చాటుకున్నారు. 'అంకుల్', 'ఓరి నీ ప్రేమ బంగారం కానూ' చిత్రాలను నిర్మించారు. 'సూపర్ హీరోస్', 'రూమ్‌మేట్స్', 'కోతిమూక' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'మిస్టర్ పెళ్లాం', 'అంకుల్', 'కోతిమూక' చిత్రాలకు వివిధ విభాగాల్లో నంది పురస్కారాలు అందుకున్నారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై కళాకారులకు సేవలందించారు. సినీరంగంలో ఎంతటి గుర్తింపు సంపాదించినా ఏవీఎస్ తన జన్మస్థలమైన తెనాలిని మరువలేదు. తెనాలికి కళల రాజధానిగా గుర్తింపు తీసుకురావాలని నిరంతరం తపించారు. అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలను తెనాలిలో నిర్వహించేందుకు కృషి చేశారు. సినీ ప్రముఖులను రప్పించి కళా కార్యక్రమాలు, సన్మాన సభలు నిర్వహించారు. కళాకారులను ప్రోత్సహించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. భారీ వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా వేలాది మందికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషి చేశారు. రాజకీయాలపైనా ఆసక్తి చూపిన ఆయన తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు.

నవ్వులు మిగిల్చి.. జ్ఞాపకంగా నిలిచి

1980లో ఆశాకిరణ్మయిని ప్రేమ వివాహం చేసుకున్న ఏవీఎస్ కుటుంబ జీవితంతోపాటు కళారంగంలోనూ తన ప్రస్థానాన్ని కొనసాగించారు. 2008లో కాలేయ సంబంధిత అనారోగ్యంతో బాధపడగా కుమార్తె కాలేయ దానంతో మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. అనంతరం కోలుకుని తిరిగి సినిమాల్లో నటించారు. అయితే కాలేయ సమస్యలు మళ్లీ తీవ్రం కావడంతో 2013 నవంబర్ 8న మణికొండలోని తన కుమారుడు ప్రదీప్ నివాసంలో కన్నుమూశారు. రంగస్థల నటుడిగా, మిమిక్రీ కళాకారుడిగా, పాత్రికేయుడిగా, హాస్య నటుడిగా, దర్శక నిర్మాతగా ఎన్నో రంగాల్లో తన ప్రతిభను చాటుకున్న ఏవీఎస్ తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన భౌతికంగా దూరమైనా 'తుత్తి' అంటూ పండించిన నవ్వులు తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ప్రణాళికాబద్ధమైన పట్టణాలే ప్రగతికి పునాదులు!

నేడు ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం



- మౌలిక సదుపాయాల కల్పనతోనే నగరాల సమగ్రాభివృద్ధి
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాల విస్తరణ అవసరం
- రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, నివాస వసతులకు ప్రాధాన్యం
- పర్యావరణ పరిరక్షణతోనే సుస్థిర పట్టణాల నిర్మాణం
- ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యం

ఆకాశాన్ని తాకే భవనాలు.. విశాలమైన రహదారులు.. అత్యాధునిక నిర్మాణాలు.. ఇవి మాత్రమే పట్టణాభివృద్ధికి కొలమానాలు కావు. ప్రతి పౌరుడికి సురక్షితమైన నివాసం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన రవాణా, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నప్పుడే నిజమైన పట్టణాభివృద్ధి సాధ్యమవుతుంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాలను తీర్చిదిద్దడంతోపాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటం కూడా అత్యంత అవసరం. ఈ లక్ష్యాలను ప్రపంచానికి గుర్తుచేస్తూ ప్రతి సంవత్సరం నవంబర్ 8న ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పట్టణాలు, నగరాలను ఆరోగ్యకరమైన, సురక్షితమైన, ఆర్థికంగా బలమైన నివాస ప్రాంతాలుగా అభివృద్ధి చేయడంలో ప్రణాళికల ప్రాధాన్యాన్ని తెలియజేయడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.

పట్టణాలు, నగరాల ప్రస్తుత అవసరాలతోపాటు భవిష్యత్తులో పెరిగే జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడమే పట్టణ ప్రణాళిక. భూమి వినియోగం, నివాస ప్రాంతాల ఏర్పాటు, రహదారుల నిర్మాణం, ప్రజా రవాణా వ్యవస్థ, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, పార్కులు, పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి వంటి అనేక అంశాలు ఇందులో భాగంగా ఉంటాయి. పట్టణాలు అస్తవ్యస్తంగా విస్తరించకుండా నియంత్రిత పద్ధతిలో అభివృద్ధి చెందేలా చూడటంలో ప్రణాళికలు కీలక పాత్ర పోషిస్తాయి. సరైన ప్రణాళిక లేకుండా విస్తరించే నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు, నీటి కొరత, కాలుష్యం, మురుగునీటి సమస్యలు, నివాస స్థలాల కొరత వంటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదముంది. ఉపాధి, విద్య, వైద్య సదుపాయాలు, వ్యాపార అవకాశాల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. దీంతో నగరాలపై జనాభా ఒత్తిడి అధికమవుతోంది. జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు విస్తరించకపోతే ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా నివాస గృహాల కొరత, ట్రాఫిక్ రద్దీ, తాగునీటి సమస్య, పారిశుద్ధ్య లోపాలు, చెత్త నిర్వహణ వంటి అంశాలు పట్టణ పాలనకు సవాళ్లుగా మారుతున్నాయి. వీటిని అధిగమించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో జనాభా ఎంత పెరుగుతుంది, అందుకు ఎన్ని నివాసాలు అవసరం, రవాణా వ్యవస్థను ఎలా విస్తరించాలి, నీటి వనరులను ఎలా వినియోగించుకోవాలి వంటి అంశాలను ముందుగానే అంచనా వేయాలి. పట్టణాల్లో నివసించే ప్రతి ఒక్కరికీ కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడటం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. రహదారుల నిర్మాణంతోపాటు నాణ్యమైన ప్రజా రవాణా వ్యవస్థ, నిరంతర తాగునీటి సరఫరా, సమర్థవంతమైన మురుగునీటి పారుదల, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, క్రీడా మైదానాలు, ఉద్యానవనాలు వంటి సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. పట్టణాల విస్తరణలో కేవలం వాణిజ్య భవనాలు, నివాస సముదాయాల నిర్మాణంపైనే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సదుపాయాల కల్పనపైనా దృష్టి సారించాలి. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలకంగా మారింది. చెట్ల నరికివేత, చెరువుల ఆక్రమణ, వాయు కాలుష్యం, నీటి వనరుల కలుషితం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పట్టణాల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు పట్టణ ప్రణాళికలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక స్థానం కల్పించాలి. చెరువులు, కుంటలు, సహజ నీటి ప్రవాహ మార్గాలను సంరక్షించడంతోపాటు ఉద్యానవనాలు, పచ్చని ప్రదేశాలను విస్తరించాలి. వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం వంటి చర్యలను ప్రోత్సహించాలి. ప్రకృతికి అనుకూలమైన అభివృద్ధి విధానాలను అనుసరించినప్పుడే పట్టణాలు భవిష్యత్తు తరాలకు నివాసయోగ్యంగా నిలుస్తాయి. పట్టణాభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణాలను అభివృద్ధి చేయాలి. పేదలకు అందుబాటు ధరల్లో నివాస సదుపాయాలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా సామాజిక అసమానతలను తగ్గించవచ్చు. ప్రతి పౌరుడు సురక్షితంగా ప్రయాణించేందుకు అనువైన రహదారులు, కాలిబాటలు, ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలి. ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి ఆర్థిక ప్రగతికి కూడా దోహదపడుతుంది. మెరుగైన రవాణా, విద్యుత్, నీటి సరఫరా, సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పరిశ్రమలు, చూపుతాయి. తద్వారా కొత్త పరిశ్రమలు ఏర్పడి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వాణిజ్య కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాలు, నివాస సముదాయాల మధ్య సమన్వయం ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తే ప్రజల ప్రయాణ సమయం, రవాణా వ్యయాలు తగ్గే అవకాశం ఉంటుంది. పట్టణాల ఆర్థికాభివృద్ధితోపాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇది దోహదం చేస్తుంది. పట్టణ ప్రణాళిక కేవలం ప్రభుత్వాలు, అధికారుల బాధ్యత మాత్రమే కాదు. ప్రజల భాగస్వామ్యం కూడా అంతే అవసరం. పట్టణాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించడం, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో అభిప్రాయాలు తెలియజేయడం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి చర్యల ద్వారా పౌరులు పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావచ్చు. స్థానిక సంస్థలు, పట్టణ ప్రణాళిక నిపుణులు, పర్యావరణ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పౌరులు సమన్వయంతో పనిచేసినప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. పట్టణాల అభివృద్ధి అనేది కేవలం నేటి అవసరాలను తీర్చే ప్రక్రియ కాదు. రాబోయే తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించే బాధ్యత కూడా. వాతావరణ మార్పులు, జనాభా పెరుగుదల, సహజ వనరుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న నగరాలను నిర్మించాలి. ఇందుకోసం దీర్ఘకాలిక దృష్టితో ప్రణాళికలు రూపొందించి వాటిని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పట్టణాల భవిష్యత్తుపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. కాంక్రీటు కట్టడాల విస్తరణ మాత్రమే అభివృద్ధి కాదని, ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రకృతిని కాపాడటమే నిజమైన ప్రగతికి నిదర్శనమని గుర్తించాలి. నేటి ప్రణాళికలే రేపటి నగరాల రూపురేఖలను నిర్ణయిస్తాయి. ప్రణాళికాబద్ధమైన పట్టణాల నిర్మాణమే ఆరోగ్యకరమైన సమాజానికి, సుస్థిరమైన భవిష్యత్తుకు బలమైన పునాది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఎక్స్ కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్

నేడు అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం!

ఆధునిక ఆరోగ్య సంరక్షణలో వ్యాధి నిర్ధారణకు అత్యంత కీలకమైన 'అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం' ప్రతి సంవత్సరం నవంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడుతోంది. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఎక్స్-కిరణాలను జర్మన్ భౌతిక శాస్త్రవేత్త విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ 1895 నవంబర్ 8న కనుగొన్నారు. ఆయన చేసిన ఈ చారిత్రాత్మక ఆవిష్కరణకు గుర్తుగా రేడియోలాజికల్ సొసైటీ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీని అధికారిక రేడియాలజీ దినోత్సవంగా ప్రకటించారు.

ఎక్స్-రే ఆవిష్కరణ వెనుక ఆసక్తికర కథనం

విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మార్చి 27, 1845 – ఫిబ్రవరి 10, 1923) జర్మనీలోని లెన్నెప్ లో జన్మించారు. జ్యూరిచ్ విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి పట్టా పొందిన ఆయన, వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా సేవలందించారు. 1895 నవంబర్ 8న ఆయన కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం) తో ప్రయోగాలు చేస్తున్న సమయంలో ఒక అద్భుతం గమనించారు. ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ, సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించడం ప్రారంభించింది. కాథోడ్ ట్యూబ్ నుంచి వెలువడిన అజ్ఞాత కిరణాలు కాగితం, చెక్క, లోహపు పలకల గుండా కూడా ప్రయాణించగలవని ఆయన నిరూపించారు. మనుషుల కళ్ళకు కనిపించని ఈ కిరణాలను ఆయన 'ఎక్స్-కిరణాలు' అని పేరు పెట్టారు. తన భార్య చేతిని ఫోటోగ్రాఫిక్ ప్లేట్ మీద ఉంచి ఈ కిరణాలను ప్రసారం చేయగా, ఉంగరంతో సహా చేతి ఎముకల పంజరం స్పష్టంగా ముద్రితం కావడంతో వైద్య



రంగంలో సరికొత్త శకం ప్రారంభమైంది. ఎక్స్ కిరణాల ద్వారా మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని భావించిన రాంట్జెన్, తన ఆవిష్కరణకు ఎక్కడా పేటెంట్ హక్కులు తీసుకోలేదు. మానవాళికి తన పరిశోధన ఫలితాలు ఉచితంగా అందాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నారు. 1901లో ఆయనకు భౌతిక శాస్త్రంలో మొట్టమొదటి నోబెల్ బహుమతి లభించగా, ఆ బహుమతి ద్వారా వచ్చిన పూర్తి ఆర్థిక ప్రతిఫలాన్ని వర్జ్ బర్గ్ విశ్వవిద్యాలయానికే విరాళంగా అందజేశారు. తొలి ప్రపంచ యుద్ధం సమయంలో ఏర్పడిన ద్రవ్యోల్బణం కారణంగా చివరి రోజుల్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ఆయన తన నిస్స్వార్థ తత్వాన్ని వీడలేదు. వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరపీ) ఈ కిరణాలు మూలస్తంభంగా నిలిచాయి. వైద్య రంగంతో పాటు భద్రతా రంగంలోనూ ఇవి విస్తృతంగా ఉపయోగపడుతున్నాయి. ఆయన చేసిన అమూల్యమైన సేవలకు గౌరవార్థంగా ఆవర్తన పట్టికలోని 111 పరమాణు సంఖ్య గల మూలకానికి 'రాంట్జెనీయం' అని పేరు పెట్టి IUPAC సంస్థ ఘనంగా గౌరవించింది. రేడియాలజీ దినోత్సవ సందర్భంగా మానవాళికి విప్లవాత్మక వైద్య వరాన్ని అందించిన మహనీయుడు విల్హేల్మ్ రాంట్జెన్‌ను ప్రపంచం స్మరించుకుంటోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఉత్కంఠ పోరులో భారత్‌దే పైచేయి!

న్యూజిలాండ్‌పై నాలుగు పరుగుల తేడాతో విజయం



- వర్షం అంతరాయంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితం
- ఐదు వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో టీమిండియా
- 134 పరుగులకే కుప్పకూలిన కివీస్ బ్యాటింగ్
- నాలుగు వికెట్లతో చెలరేగిన గుర్నూర్ బ్రార్
- 113 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయినా భారత్‌కు విజయం

వెల్లింగ్టన్, నవంబర్ 7 : న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. వర్షం అంతరాయం కలిగించిన ఈ పోరులో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం నాలుగు పరుగుల తేడాతో గెలుపొందినట్లు మ్యాచ్ వివరాలు వెల్లడిస్తున్నాయి. తొలుత భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ 41 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌ తైంది. అనంతరం 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కూడా కివీస్ బౌలర్ల ధాటికి తడబడింది. ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. వర్షం కారణంగా ఆట తిరిగి కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితాన్ని నిర్ణయించారు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.



భారత బౌలర్ల విజృంభణ

టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భారత బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టంగా బంతులు సంధించి న్యూజిలాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ తొలి ఓవర్‌ను పరుగులేమీ ఇవ్వకుండా పూర్తి చేయగా, రెండో ఓవర్‌లో ఆకిబ్ నబీ టిమ్ సీఫర్ట్‌ను పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత విల్ యంగ్ (6)ను కూడా నబీ ఔట్ చేశాడు. హెన్రీ నికోల్స్ (11)ను అన్షుల్ కాంబోజ్ బౌల్డ్ చేయడంతో న్యూజిలాండ్ 19 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

53 పరుగులకే ఐదు వికెట్లు

ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను ఆదుకునేందుకు డారిల్ మిచెల్ ప్రయత్నించాడు. టామ్ లాథమ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు కృషి చేశాడు. అయితే గుర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో లాథమ్ (7) ఔటయ్యాడు. అదే ఓవర్‌లో గ్లెన్ ఫిలిప్స్‌ను పరుగులేమీ చేయకుండానే పెవిలియన్‌కు పంపించడంతో కివీస్ 53 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ బ్యాటింగ్ క్రమం కుప్పకూలింది.

మిచెల్ ఒంటరి పోరాటం

ఒకవైపు వికెట్లు పడుతున్నా డారిల్ మిచెల్ మాత్రం పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. మిచెల్ శాంట్నర్‌తో కలిసి ఆరో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. మిచెల్ 104 బంతుల్లో 55 పరుగులు చేసి అర్ధశతకంతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. శాంట్నర్ 38 బంతుల్లో 31 పరుగులు చేసి సహకరించాడు. అయితే అక్షర్ పటేల్ బౌలింగ్‌లో మిచెల్ ఔటవడంతో న్యూజిలాండ్ మళ్లీ ఒత్తిడిలో పడింది. అనంతరం గుర్నూర్ బ్రార్ శాంట్నర్‌ను పెవిలియన్‌కు పంపించాడు. చివర్లో కైల్ జేమీసన్ (7)ను అక్షర్ పటేల్ బౌల్డ్ చేయగా, నాథన్ స్మిత్ (3)ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేశాడు. బ్లెయిర్ టిక్నర్ (2)ను అన్షుల్ కాంబోజ్ బౌల్డ్ చేయడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 41 ఓవర్లలో 134 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 10 ఓవర్లలో 30 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఆకిబ్ నబీ, అక్షర్ పటేల్, అన్షుల్ కాంబోజ్ రెండేసి వికెట్లు సాధించారు.

స్వల్ప లక్ష్యానికీ భారత్ తడబాటు

135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కూడా వెల్లింగ్టన్ పిచ్‌పై కష్టాలు తప్పలేదు. బౌలర్లకు అనుకూలించిన పరిస్థితుల్లో భారత బ్యాటర్లు పరుగులు సాధించేందుకు ఇబ్బందిపడ్డారు. రోహిత్ శర్మ 23 పరుగులు చేయగా, శ్రేయాస్ అయ్యర్ 30 పరుగులతో రాణించాడు. కేఎల్ రాహుల్ 26 పరుగులతో అజేయంగా నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జేమీసన్, జాకబ్ డఫీ చెరో మూడు వికెట్లు పడగొట్టి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. దీంతో స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలోనే భారత్ ఏడు వికెట్లు కోల్పోయింది.

వర్షమే ఫలితాన్ని తేల్చింది

భారత్ ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. అప్పటికి డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నిర్ణయించిన లక్ష్యాన్ని భారత్ అధిగమించినట్లు మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి. దీంతో నాలుగు పరుగుల తేడాతో టీమిండియాను విజేతగా ప్రకటించినట్లు సమాచారం. కివీస్ బౌలర్లు పోరాడినప్పటికీ వర్షం కారణంగా మ్యాచ్‌ను కొనసాగించే అవకాశం లేకపోయింది. నాలుగు వికెట్లతో న్యూజిలాండ్ బ్యాటింగ్ పతనంలో కీలక పాత్ర పోషించిన గుర్నూర్ బ్రార్‌కు మ్యాచ్ ఉత్తమ ఆటగాడి పురస్కారం దక్కినట్లు సమాచారం. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యాన్ని సాధించింది. మొదటి రెండు మ్యాచ్‌ల్లో విజయాలు అందుకున్న టీమిండియా తదుపరి పోరులోనూ గెలిచి సిరీస్‌పై పట్టు మరింత బిగించాలని భావిస్తోంది.

టెస్టులకు రివర్స్ స్వింగ్ కింగ్ గుడ్‌బై!

- 13 ఏళ్ల సుదీర్ఘప్రస్థానానికి మహమ్మద్ షమీ ముగింపు
- అరంగేట్రం చేసిన రోజునే వీడ్కోలు నిర్ణయం
- 64 టెస్టులు.. 229 వికెట్లు.. ఆరుసార్లు ఐదు వికెట్ల ఘనత
- తొలి టెస్టులోనే తొమ్మిది వికెట్లతో సంచలనం
- వన్డేలు, టీ20లు, ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో కొనసాగనున్న పేసర్



కోల్‌కతా, నవంబర్ 7 : భారత క్రికెట్‌లో తన పదునైన బంతులతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ పేసర్ మహమ్మద్ షమీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికినట్లు ప్రకటించాడు. పదమూడేళ్ల సుదీర్ఘ టెస్టు ప్ర యాణానికి ముగింపు పలుకుతూ సామాజిక మాధ్యమాల ద్వారా తన నిర్ణయాన్ని వెల్లడించినట్లు సమాచారం. 2013 నవంబర్ 7న వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా టెస్టుల్లో అరంగేట్రం చేసిన షమీ, సరిగ్గా పదమూడేళ్ల త ర్వాత అదే తేదీన ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. టెస్టులకు వీడ్కోలు పలికినప్పటికీ వన్డేలు, టీ20లు, ఐపీఎల్‌తోపాటు దేశవాళీ క్రికెట్‌లో కొనసాగనున్నట్లు తెలిపాడు. 2013 నవంబర్‌లో కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టుతో షమీ అంతర్జాతీయ టెస్టు ప్రస్థానం ప్రారంభమైంది. తొలి మ్యా చ్‌లోనే తన బౌ లింగ్ ప్రతిభను చాటుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి తొమ్మిది వికెట్లు పడగొట్టి క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. పదునైన పేస్ బౌలింగ్, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్, బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగల సామర్థ్యంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది దులకు గురిచేశాడు. ముఖ్యంగా పాత బంతితో రివర్స్ స్వింగ్ రాబట్టడంలో షమీ ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. భారత్ తరఫున 64 టెస్టులు ఆడిన షమీ మొత్తం 229 వికెట్లు పడగొట్టాడు. ఆరుసార్లు ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు సాధించాడు. 27.71 బౌలింగ్ సగటు, 50.2 స్ట్రైక్ రేట్‌తో తన టెస్టు ప్రస్థానాన్ని కొనసాగించాడు. స్వదేశంలో మరింత ప్రభావవంతమైన బౌలర్‌గా నిలిచిన షమీ 22.1 సగటుతో వికెట్లు సాధించాడు. భారత గడ్డ పై ప్రతి 42.6 బంతులకు ఒక వికెట్ పడగొట్టిన ఘనత అతడి సొంతం. భారత్ తరఫున అత్యధిక టెస్టు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో తొలి 15 స్థానాల్లో చోటు సంపాదించాడు. స్వదేశంలోనే కాకుండా విదేశీ పర్యటనల్లోనూ షమీ తన బౌలింగ్‌తో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల్లో ప్రత్యర్థి బ్యాటర్లకు సవాల్ విసిరాడు. వేగంతోపాటు రివర్స్ స్వింగ్‌ను సమర్థంగా వినియోగించి కీలక సమయాల్లో వికెట్లు సాధించాడు. 2016లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత పేస్ దళంలో కీలక సభ్యుడిగా ఎన్నో విజయాల్లో భాగస్వామి అయ్యాడు. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ షమీ చివరి టెస్టు మ్యాచ్‌గా నిలిచింది. ఆ తర్వాత గాయాలు, ఫిట్‌నెస్ సమస్యల కారణంగా టెస్టు జట్టుకు దూరమయ్యాడు. తిరిగి జట్టులోకి రావడానికి ప్రయత్నించినప్పటికీ టెస్టు క్రికెట్‌లో మరో అవకాశం దక్కలేదు. చివరకు సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది. టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు సందర్భంగా తన ప్రయాణంలో సహకరించిన కోచ్‌లు, శిక్షకులు, ఫిజియోలు, సహచర ఆటగాళ్లకు షమీ కృతజ్ఞతలు తెలిపినట్లు సమాచారం. ముఖ్యంగా తనపై ప్రేమాభిమానాలు చూపిన క్రికెట్ అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశాడు. ఎన్నో గాయాలు, ఒడిదుడుకులు ఎదురైనా భారత జట్టు కోసం మైదానంలో పోరాడిన అనుభవాలను గుర్తుచేసుకున్నాడు. టెస్టు క్రికెట్ నుంచి తప్పుకున్నప్పటికీ షమీ ఇతర ఫార్మాట్లలో కొనసాగనున్నాడు. వన్డేలు, టీ20లతోపాటు ఐపీఎల్, బెంగాల్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో ఆడనున్నట్లు తెలిపాడు. తన అనుభవాన్ని వినియోగించుకుని పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రాణించాలనే లక్ష్యంతో ఉన్నట్లు సమాచారం. భారత టెస్టు క్రికెట్‌లో పేస్ బౌలింగ్‌కు కొత్త పదును తీసుకొచ్చిన ఆటగాళ్లలో షమీ ఒకడిగా గుర్తింపు పొందాడు. ముఖ్యంగా పాత బంతితో రివర్స్ స్వింగ్ రాబట్టి ప్రత్యర్థి బ్యాటర్లను బోల్తా కొట్టించే అతడి నైపుణ్యం అభిమానులకు గుర్తుండిపోతుంది. పదమూడేళ్ల టెస్టు ప్రయాణంలో 229 వికెట్లతో తనదైన ముద్ర వేసిన షమీ నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



ఐఓఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు

దిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్ల కమిషన్ నూతన నాయకత్వం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. స్టార్ షట్లర్ పి.వి.సింధు ఐఓఏ అథ్లెట్ల కమిషన్ ఛైర్‌పర్సన్‌గా.. భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అగ్రశ్రేణి వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, స్విమ్మర్ సాజన్ ప్రకాశ్ ఐఓఏ సర్వసభ్య సమావేశానికి అథ్లెట్ల కమిషన్ ప్రతినిధులుగా ఎంపికయ్యారు. ఈ నాలుగు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అభ్యర్థులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి సంజయ్ శ్రీవాస్తవ ప్రకటించారు. ఈ నలుగురు క్రీడాకారులు 2026-2030 కాలానికి గాను నాలుగేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. డిసెంబరు 5న ఐఓఏ ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సింధు, హర్మన్‌ప్రీత్ సభ్యులుగా చేరతారు. ఐఓఏ సర్వసభ్య సమావేశం ప్రతినిధులుగా ఎన్నికైన చాను, సాజన్.. డిసెంబరు 5న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు కలిగి ఉంటారు. పది మంది సభ్యులతో కూడిన ఐఓఏ అథ్లెట్ల కమిషన్‌లో సలీమా టెటె (హాకీ), స్వప్నిల్ కుసాలె (షూటింగ్), భవానీ దేవి (ఫెన్సింగ్), తజిందర్‌పాల్ సింగ్ తూర్ (షాట్‌పుట్), బొంబేలా దేవి (ఆర్చరీ), మంజీత్‌సింగ్ (కయాకింగ్-కనోయింగ్) సభ్యులుగా ఉన్నారు.



ధోనీని 'మాహీ అంకుల్' అని పిలుస్తా: నటి అనుష్క సేన్

కెప్టెన్' కూల్ ఎంఎస్ ధోనీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయనను ఒక్కసారైనా నేరుగా చూడాలని ఎంతోమంది ఆశపడుతారు. అలాంటి ధోనీతో తనకు చిన్ననాటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉందని నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అనుష్క సేన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయనను తాను ప్రేమగా 'మాహీ అంకుల్' అని పిలుస్తానని.. ధోనీ తనను చిక్కీ అని అంటారని తెలిపారు. గతంలో ధోనీతో కలిసి పలు వాణిజ్య ప్రకటనల్లో నటించడం వల్ల తమ మధ్య మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. పదేళ్ల క్రితం మొదటిసారి ధోనీని కలిసినప్పటి విషయాలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తామిద్దరం రాంచీ నుంచే వచ్చామన్నారు. ధోనీతో కలిసి తాను ఏడేళ్లపాటు 21 ప్రకటనల్లో నటించానని తెలిపారు. ఇప్పటికీ ఎక్కడైనా కలిస్తే.. ఆయన ఎంతో ప్రేమగా దగ్గరకు తీసుకుంటారన్నారు. 'యహా మై ఘర్ ఘర్ ఖేలీ' సీరియల్‌తో అనుష్క సేన్ ఏడేళ్లకే తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించారు. అనేక వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 'బాల్ వీర్'లో మెహర్ పాత్ర ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. దేవోంకే దేవ్ మహదేవ్, ఝాన్సీ కీ రాణి వంటి వాటిల్లో నటించారు.

ధినిధికి మరో కాంస్యం

డకార్ (సెనెగల్): యూత్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత యువ స్విమ్మర్ ధినిధి దేశింగు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒకే ఎడిషన్‌లో రెండు వ్యక్తిగత పతకాలు నెగ్గిన భారత తొలి అథ్లెట్‌గా రికార్డుకెక్కింది. మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచిన ఈ 16 ఏండ్ల కర్ణాటక అమ్మాయి 200 మీటర్ల పోటీలనూ కాంస్య పతకాన్ని ముద్దాడింది. శుక్రవారం జరిగిన తుదిరేసును ధినిధి 2 నిమిషాల 02.28 సెకండ్లతో మూడో స్థానంతో ముగించింది.





వచ్చిందమ్మా.. మదరాసి రబ్బరు బొమ్మ

సాయి శ్రీనివాస్, నేహా శెట్టి

'టైసన్ నాయుడు'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని సాగర్ కె.చంద్ర తెరకెక్కించారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. నేహా శెట్టి కథానాయిక. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "మదరాసి రబ్బరు బొమ్మ.." అంటూ సాగిన ఈ మాస్ పాటకి భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. సురేశ్ గంగుల సాహిత్యమందించారు. నల్గొండ గద్దర్ నర్సన్న, రోహిణి సోరట్ సంయుక్తంగా ఆలపించారు. క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ డ్రామాలో బెల్లంకొండ శ్రీనివాస్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనున్నారు.



ఇన్‌స్టాగ్రామ్ హ్యాక్..


వ్యక్తిగత కంటెంట్ లీక్‌పై సురేఖా వాణి ఆగ్రహం

టాలీవుడ్ నటి సురేఖా వాణి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఆమె తీవ్రంగా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అయిందని తెలిపారు. తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో నోట్ పెట్టారు. మీమ్ పేజీలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు, వ్యక్తులు ఎవరైనా సరే.. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆ కంటెంట్‌ను షేర్ చేయడం, రీపోస్ట్ చేయడం తక్షణమే ఆపాలని నటి విజ్ఞప్తి చేశారు. "ఈ కంటెంట్‌ను షేర్ చేస్తున్న ఖాతాలు, వ్యక్తులను గుర్తించి, ఆధారాలను సేకరిస్తాను. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను" అని హెచ్చరించారు. వ్యూస్, రీచ్, పబ్లిసిటీ కోసం.. ఈ పరిస్థితిని ఎవరూ తమకు అనుకూలంగా మార్చుకోవద్దని కోరారు. తన వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని, ఇది చాలా తీవ్రమైన అంశమని ఆమె పేర్కొన్నారు. 2005లో ఇండస్ట్రీకి వచ్చిన సురేఖా వాణి.. ఆ తర్వాత వరుసగా హిట్ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 'భద్ర', 'బొమ్మరిల్లు', 'ఏమాయ చేశావే', 'నాయక్', 'బాడ్ షా' వంటి సినిమాలతో మెప్పించారు.



సంక్రాంతికి సందడి

భాషతో సంబంధం లేకుండా కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారు కథానాయిక మాళవిక మోహనన్. ఇటీవలే 'సర్దార్ 2' చిత్రంలో నటించారు. ప్రస్తుతం విలక్షణ నటుడు విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నోవెల్'తో తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు మాళవిక. ఇటీవలే ఈ సినిమాని డిసెంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ నేపథ్యంలోనే "పేజీలు తిరుగుతున్నాయి.. తేదీ ఖరారైంది. 'పాకెట్ నోవెల్' ఈ సంక్రాంతికి రాబోతోంది!' అనే క్యాప్షన్‌తో ఒక కొత్త పోస్టర్‌ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. ఈ పోస్టర్‌లో విజయ్ సేతుపతి, మాళవిక, రాజ్ బి.శెట్టి తదితరులు.. వాళ్ల మధ్యలో ఒక డబ్బుల బ్యాగ్ కనిపించిన తీరు సినీప్రియుల్ని ఆకట్టుకుంది. త్యాగరాజన్ కుమార రాజా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాని ట్రైలర్ డర్టెన్, కినో ఫిస్ట్ నిర్మాణ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇందులో రాజ్ బి.శెట్టి ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.





రూ.6 కోట్ల కోసం హానీట్రాప్?

6 కోట్లు ఇవ్వకపోవడంతోనే దాడి?

టాలీవుడ్ హీరోయిన్ దొంగతనం కేసులో ట్విస్ట్

కొచ్చి, నవంబర్ 7 : కొచ్చిలో ఒక యువ వైద్యుడిపై జరిగిన భౌతిక దాడి ఘటన కేరళ రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ దారుణ ఘటన వెనుక టాలీవుడ్లో మత్తు వదలరా సినిమాలో నటించిన నటి వేసిన కిలాడీ స్కెచ్ ఉన్నట్లు పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. నటి అతుల్య చంద్ర ప్రధాన సూత్రధారిగా, నటుడు బిపిన్ పెరుంపల్లితో కలిసి ఏకంగా రూ. 6 కోట్లు దండుకునేందుకు ప్రయత్నించడం, ఆ తర్వాత బ్లాక్ మెయిల్‌కు పాల్పడటం ఇప్పుడు సర్వత్రా హాట్ టాపిక్‌గా మారింది. అతుల్య చంద్ర బంధువుల అమ్మాయితో సదరు డాక్టర్‌కు సన్నిహిత సంబంధాలు, స్నేహం ఉంది. ఆ పరిచయాన్నే ఆసరాగా చేసుకున్న నటి అతుల్య, నటుడు బిపిన్ పెరుంపల్లి కలిసి డాక్టర్ వద్ద నుంచి భారీగా డబ్బు గుంజాలని ప్లాన్ వేశారు. ఇద్దరి మధ్య ఉన్న ఒక వివాదాన్ని పరిష్కరిస్తామని నమ్మబలికి ఫ్లాట్ కి రప్పించుకుని అనంతరం, డాక్టర్‌ను ఏకంగా రూ. 6 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, అంత భారీ మొత్తం తన వద్ద లేదని, తానివ్వలేనని డాక్టర్ తేల్చి చెప్పడంతో ఈ ముఠా తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టింది. డాక్టర్‌కు సంబంధించిన అత్యంత వ్యక్తిగత వీడియో ఫుటేజ్, ప్రైవేట్ వాట్సాప్ చాట్స్‌ను సోషల్ మీడియాలో లీక్ చేస్తామంటూ తీవ్ర స్థాయిలో బెదిరింపులకు దిగింది. వారి బ్లాక్ మెయిల్‌కు కూడా ఆ డాక్టర్ లొంగకపోవడంతో, పక్కా ప్లాన్ ప్రకారం అతనిపై అత్యంత దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే, పక్కా పథకం ప్రకారం డాక్టర్‌ను 'హానీట్రాప్' చేశారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి త్వరలోనే అతుల్య బంధువు వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేయనున్నారు. ఇక ఈ కేసులో పాల్గొన్న నిందితులకు పక్కా క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నటుడు బిపిన్ పెరుంపల్లి డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై గతంలోనే ఎన్‌డీపిఎస్ (డ్రగ్స్) కేసులతో సహా దాడులకు పాల్పడిన సుమారు 8 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం పరారీలో ఉన్న మరో నిందితుడైన జిమ్ ట్రైనర్ వద్ద డాక్టర్‌కు సంబంధించిన మొబైల్ ఫోన్లు (వ్యక్తిగత డేటా ఉన్న ఫోన్లు) ఉన్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, ఈ సెలబ్రిటీల ముఠా వెనుక ఉన్న చీకటి కోణాలను వెలికితీసే పనిలో ఉన్నారు.



Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**